తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4

సంచిక : 15

పేజీలు - 8

వెల- రూ 5 : 00

prajamantalu.com

# ప్రజా మంటలు

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శుక్రవారం 02, జూన్ 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri


## 4న నిర్మల్‌కు సిఎం కెసిఆర్

**ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి**



నిర్మల్,జూన్1 (ప్రజా మంటలు) : ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 4న నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. అదేరోజు కొత్త కలెక్టరేట్ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఎల్లపల్లి శివారు క్రషర్ రోడ్ లో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పరిశీలించారు. బహిరంగ సభ వేదిక, ట్రాఫిక్, పార్కింగ్, హెలిప్యాడ్ ప్రాంతాలను సందర్శించి రూట్ మ్యాప్ ను పరిశీలించారు. భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో చర్చించారు. సభ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

# మూడోసారి... అధికారం మాదే

- కెసిఆర్ హ్యాట్రిక్ సిఎం కాబోతున్నారు
- బిజెపి, కాంగ్రెస్‌లు చేసిందేమీ లేదు
- తెలంగాణలో మాతో పోటీపడే విపక్షమే లేదు
- పివిని అవమానించిన ఘనులు కాంగ్రెస్ నేతలు
- నీళ్లు,నిఆమకాలు, నిధుల ట్యాగ్ లైన్ మరువలేదు
- తెలంగాణను మించిన పాలన మరెక్కడా లేదు
- కొందరు ఎమ్మెల్యేల పనితీరు మెరుగు పడాల్సిందే
- మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రికెటిఆర్ వెల్లడి



హైదరాబాద్,జూన్1 (ప్రజా మంటలు) : తెలంగాణ రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి కూడా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 90 నుంచి 100 స్థానాల్లో బీఆర్ఎస్ ఈజీగా గెలుస్తుంది. మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు అని కేటీఆర్ పేర్కొన్నారు. మంచి ప్రదర్శన, ప్రజల్లో పలుకుబడి ఉన్న ఎమ్మెల్యేలందరికీ సీట్లు దక్కుతాయన్నారు. కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుని

మిగతా... 2లో





తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలకు.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయ భవనాల సముదాయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.... వివిధ రకాల రంగు రంగుల లైట్లతో విద్యుత్ కాంతుల్లో ఐడి వో సి వెలిగిపోతుంది.. రేపటి నుండి ప్రారంభం అయ్యే దశాబ్ది ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు అధికారులు తెలిపారు.

## ప్రత్యామ్నాయ రాజకీయాలకు

# దిక్సూచి కెసిఆర్

- విపక్షాలు కలసివుంటే ఇప్పటికే ఫ్రంట్ సాధ్యమయ్యేది
- విపక్షాల్లో అనైక్యతతోనే కెసిఆర్ ఒంటరి పోరాటం

హైదరాబాద్,జూన్1(ప్రజా మంటలు) : రాజకీయాల్లో కెసిఆర్ లాంటి నేత బహు అరుదు. పట్టుపడితే విడవకుండా పోరాడే తత్వం ఆయనకు పుట్టుకుతో వచ్చింది. అయన మాత్రమే మోడీని ఎదుర్కొని నిలవగల సత్తా ఉన్న నేత అని చెప్పొచ్చు. మోడీతో ఉన్న ముప్పును ముందే గ్రహించి కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన తెచ్చారు. బీజేపీని దీటుగా ఎదుర్కొని మట్టికరిపిం చేందుకు ఉమ్మడిగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. అప్పట్లో కెసిఆర్ స్టాలిన్,నవీన్ పట్నాయక్, మమతా బెనర్జీ, శరద్ పవార్ తదితర నేతలను నేరుగా కలిసి ప్రత్యామ్నాయ రాజకీయాలపై చర్చకు తెరతీసారు. కానీ ఈ నేతల్లో ఎవరు కూడా మళ్లీ కెసిఆర్ ప్రతిపాదనలపై ప్రస్తావించలేదు. నిజానికి ఇప్పుడు దేశంలో ప్రజాస్వామ్యం పెద్ద ప్రమాదంలో పడింది. రాజ్యాంగంపైనా, సమాఖ్య వ్యవస్థపైనా నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా సమైక్యంగా, సమర్థంగా పోరాడాలి. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ము తున్న మోడీ జిఎస్టీ పేరుతో సామాన్యుల నడ్డి విరిచారు. పెట్రో ధరలు విపరీతంగా పెంచారు. ఈ క్రమంలో అందరం కలిసి దేశ ప్రజలకు విశ్వసనీయ ప్రత్యామ్నాయాన్ని అందించాలన్నది కెసిఆర్ సంకల్పం. నిజానికి ఈ విషయంలో కెసిఆర్‌ను ముందు పెట్టి సాగితే ఓ బలమైన ప్రత్యామ్నాయం కాగలదు. దీనిని ఎవరూ పట్టించుకోక పోవడంలో బలమైన కారణం ఉంది. మనదేశంలో ప్రాంతీయ పార్టీలను నడుపుతున్న నేతలం దరికి ప్రధాని కావాలన్న కోరికత ప్ప దేశ రాజకీయాలను మార్చాలన్న సంకల్పం లేదు. ఎవరికి వారు తామే ప్రధాని పదవికి తగిన అభ్యర్థులమని భావిస్తున్నారు.

మిగతా... 2లో




## నేడు తెలంగాణ ఆవిర్భావం

- ప్రజలకు శుభాకాంక్షలు చెప్పిన కెసిఆర్

హైదరాబాద్,జూన్1 (ప్రజా మంటలు) : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సంసందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల హృదయాలు ఆనందం, గర్వంతో నింపుతున్న సందర్భమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలు గర్వించే క్షణమని, ఆవిర్భావ దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో అన్ని వర్గాలవారు పాల్గొన్నారని, తెలంగాణ కోసం అనేకమంది త్యాగాలు చేశారని గుర్తు చేసుకున్నారు.



## నైరుతి రుతు పవనాలు వచ్చేస్తున్నాయి..

- అండమాన్‌లో విస్తరించిన రుతుపవనాలు

న్యూఢిల్లీ,జూన్1 (ప్రజా మంటలు) : నైరుతి రుతు పవనాలు వచ్చేస్తున్నాయి.. ఇప్పటికే అండమాన్ వ్యాప్తంగా విస్తరిస్తున్న రుతు పవనాలు.. జూన్ 4వ తేదీ నాటికి కేరళను తాకనున్నట్లు భారత వాతావరణ శాఖ ప్రకటించింది. అక్కడి నుంచి తెలుగు ర్టాషాల్లోకి

మిగతా... 2లో




## దశాబ్దివేళ పంచాయితీల్లో కానరాని కళ

- నిధులు విడుదల కాకపోవడంతో ఆందోళన

హైదరాబాద్,జూన్1 (ప్రజా మంటలు) : తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలను కుంటున్న ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడంలేదు. మే 23న పంచాయతీలకు పెండింగ్‌లో ఉన్న రూ. 12 వందల కోట్ల బిల్లులను క్లియర్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలు సంబరాలు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం ప్రకటన చేసి 10 రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు సర్పంచ్‌లకు నిధులు అందలేదు. చాలా చోట్ల ఆస్తులు అమ్మి, అప్పులు చేసి సర్పంచ్‌లు అభివృద్ధి పనులు చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇప్పటి వరకు విడతల

మిగతా... 2లో

# కాంగ్రెస్‌ది కొంగ జపం..బిజెపిది దొంగజపం

- ఆ రెండూ అభివృద్ధి నిరోధక పార్టీలు
- ఓట్ల రాజకీయం కోసం పోటీ ఉత్సవాలు
- మీడియతో మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు



సూర్యాపేట,జూన్1 (ప్రజా మంటలు) : కాంగ్రెస్, బీజేపీలు ఓట్ల రాజకీయం కోసమే పోటీ ఉత్సవాలు చేస్తున్నాయని మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న పోటీ ఉత్సవాలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. గురువారం సూర్యాపేట జిల్లాలో జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కొంగ, దొంగ జపాలను తెలంగాణ ప్రజలు నమ్మరని వ్యాఖ్యానించారు. కేసీఆర్ తొమ్మిదేళ్ళ పాలనలో తెలంగాణ మోడల్ అభివృద్ధి దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ సాధించిన ప్రగతి దేశానికి చాటేందుకు దశాబ్ది ఉత్సవాలు చేస్తున్నామని తెలిపారు. ఆరు దశబ్దాలుగా తెలంగాణను చీకట్లోకి నెట్టిన కాంగ్రెస్, తెలంగాణ అభివృద్ధిని నిరోధించే బీజేపీ పార్టీలు ఏమని పోటీ ఉత్సవాలు చేస్తాయని ప్రశ్నించారు. కేవలం ఓట్లు, అధికారమే పరమావధిగా రెండు పార్టీల తీరు కనిపిస్తుందని జగదీష్ రెడ్డి విమర్శించారు. దేశ వెనుకబాటుకు కారణమైన కాంగ్రెస్ ఫెయిల్యూర్ పార్టీ.. వారు ఫెయిల్యూర్ సభలే చేసుకోవాలని సూచించారు. కిషన్ రెడ్డి తెలంగాణపై మాట్లడితే ప్రజలు నవ్వుకుంటారని వెల్లడించారు. వచ్చిన తెలంగాణ ప్రకటన వెనక్కి తీసుకుంటే రాజీనామాకు భయపడ్డ వారు.. తెలంగాణ గురించి ఏం మాట్లాడుతారని నిలదీశారు.

మిగతా... 2లో



## ప్రజానాడి




## జిల్లాలో వైభవోపేతంగా తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు -ప్రజలు భాగస్వామ్యం కావాలి

**- జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష**



జగిత్యాల జూన్ 01 (ప్రజా మంటలు): దశాబ్ది ప్రగతి తో పాటు తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని.. చాటేలా జిల్లాలో పండుగ వాతావరణంలో వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష తెలిపారు. ఈ నెల జూన్ 2 నుంచి 22 వరకు జిల్లాలో జరుగు తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గ్రామల నుంచి జిల్లా స్థాయి వరకు.. ఏ రోజు ఏ కార్యక్రమం చేపట్టాలో నిర్దేశిస్తూ, కార్యక్రమాలను సమన్వయం అధికారు లను నియమించినట్లు తెలిపారు. గ్రామాలు, నియోజక వర్గాలు, జిల్లాల వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులందరనీ సమన్వయం చేసుకుంటూ దశాబ్ది ఉత్స వాలను పండుగ వాతావరణంలో నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తొమ్మిదేండ్ల అనతికాలం లోనే దేశానికే ఆదర్శంగా పాలన కొనసాగిస్తూ, పదవ వసంతంలోకి అడుగిడుతున్న చారిత్రక సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఈ రోజు నుంచి జూన్ 22 వరకు ప్రత పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్న వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, జర్నలిస్ట్ లు, కళాకారులు, ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష కోరారు.

# మీరే నా బలం.. మీరే నా బలగం

- తెలంగాణ ఏర్పాటుతోనే అభివృద్ధి
- త్వరలోనే పిల్లలకు న్యూట్రిషన్ కిట్
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి హరీష్ శ్రీకారం



సిద్దిపేట,జూన్1 (ప్రజా మంటలు) : మీరే నా బలం.. మీరే నా బలగం. మీ కోసం ఇంకా కష్టపడుతా.. మరింత సేవ చేస్తా. మీ ఆశీస్సులు, దీవెనలు, మీరిచ్చే బలం ఉన్నంత కాలం మీకు సేవ చేస్తూనే ఉంటానని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామంలో మంత్రి హరీశ్‌రావు గురువారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు జడ్పీ చైర్మన్ రోజాశర్మతో కలిసి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. మల్యాల గ్రామానికి గ్రామస్తుల సహకారంతో రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చింది. ఎటు వైపు చూసినా గ్రామ రూపురేఖలు మారిపోయాయని, గల్లీ, గల్లీలో సీసీరోడ్లు వేసుకున్నామని తెలిపారు. మరో వారం రోజుల్లో గర్భిణీలకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందిస్తామని హరీశ్‌రావు తెలిపారు. పుట్టబోయే బిడ్డకు న్యూట్రిషన్ కిట్. పుట్టిన బిడ్డకు ఇచ్చేది కేసీఆర్ కిట్. ఇది కేసీఆర్‌కు ప్రజల మీద ఉన్న

మిగతా... 2లో

# నైరుతి రుతు పవనాలు వచ్చేస్తున్నాయి..

మొదటిపేజీ తరువాయి..
రావటానికి సమయం పడుతుందని స్పష్టం చేసింది. జూన్ ఒకటో తేదీ మధ్యాహ్నం విడుదల చేసిన వాతావరణ శాఖ రిపోర్ట్ ఇదే విషయాన్ని స్పష్టం చేస్తుంది. కేరళను జూన్ 4వ తేదీ నాటికి ప్రవేశిస్తుండగా.. జూన్ 8వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని.. ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించటానికి నాలుగు రోజుల సమయం పడుతుంది.. జూన్ 12వ తేదీ నాటికి ఏపీ అంతటా విస్తరిస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది. ఇక నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రంలోకి జూన్ 10 నుంచి 12వ తేదీ మధ్య ప్రవేశిస్తాయని వెల్లడించింది. వాతావరణం అనుకూలిస్తే.. జూన్ 16వ తేదీనాటికి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేస్తుంది. మండే ఎండల్లో చల్లని కబురు చెప్పింది వాతావరణ శాఖ. మొదటగా అంచనా వేసినట్లు.. జూన్ ఒకటో తేదీన కేరళలోకి నైరుతి రుతు పవనాలు రావాల్సి ఉంది. అయితే సముద్రంలో ఏర్పడిన తుఫాన్లు, వాతావరణం అనుకూలంగా లేకపోవటం వల్ల.. నాలుగు రోజులు ఆలస్యంగా జూన్ 4వ తేదీన నైరుతి దేశంలోకి వస్తుంది. కేరళ నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి రావటానికి రెండు వారాల సమయం తీసుకుంటుంది. మండే ఎండలు మరికొన్ని రోజులే ఉండొచ్చు.. ఆ తర్వాత ఎండలు ఉన్నా.. ఇంత తీవ్ర స్థాయిలో ఉండవనేది వాతావరణ శాఖ అంచనా.

# విద్యుత్ సమస్యకు చెక్ పెట్టిన తొలి సిఎం

## నిరంతర విద్యుత్‌తో సమస్యలు దూరం
## మారుతున్న వ్యవసాయ ముఖచిత్రం
## తెలంగాణలో పెరిగిన పంటదిగుబడులు



హైదరాబాద్,జూన్1 (ప్రజా మంటలు) : నిరంతర విద్యుత్..కల కాదని తెలంగాణలో సిఎం కెసిఆర్ నిరూపించారు. కరెంట్ పోతే వార్త అన్న వాదన పైకి తీసుకుని వచ్చారు. టైమ్ చూసుకుని వంటింట్లోకి వెళ్లే ఆగత్యం లేకుండా చేశారు. అలాగే కరెంట్ లేక జిరాక్స్ సెంటర్లు మూతపడ్డ ఘటనలు మాయమయ్యాయి. లాంతర్లు పట్టి నిరసనలు తెలిపే రోజులు పోయాయి. ఇందిరాపార్క్ వద్ద పారిశ్రామిక వేత్తల నిరసనలు లేవు. ఇలా చెప్పుకుంటూ పోతే కరెంట్ కథలు ఎన్నో ఉన్నాయి. తెలంగాణలో రైతే రాజు కావాలి.. తెలంగాణ రైతు రాజ్యం కావాలి! వ్యవసాయం చేయడం ఉత్సవంలా సాగాలి! రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రం సమగ్రంగా మారిపోవాలి.. అంతిమంగా బంగారు తెలంగాణ నిర్మాణం కావాలి! ఇది ఒక రాజకీయ పార్టీ సంకల్పంగా మాత్రమే చూడరాదు. దార్శనికుడైన నేత నాయకత్వంలో తీసుకున్న ప్రభుత్వ ఆలోచనగా చూడాలి. తన తపనంతా రాష్ట్రాభివృద్ధి కోసమేనని చాటిన సిఎం కెసిఆర్ రైతుల రక్షణ తన లక్ష్యమని ప్రకటించారు. కాలుష్యకారక పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహంలో కనీసం పైసావంతు రైతుకోసం ఖర్చు పెడితే పక్కాగా, ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగితే దేశం బలపడమే గాకుండా ప్రపంచానికే పట్టెడన్నం పెట్టగలదు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కోటి ఎకరాల మాగాణంగా మార్చాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి కెసిఆర్ మదిలో రైతులకు సంబంధించిన పటిష్టమైన ఆలోచనలు రావడం స్వాగతించాలి. విద్యుత్ సమస్యను అధిగమించిన తెలంగాణలో రైతులకు పెట్టుబడి అందిస్తామని చెప్పిన సిఎం కెసిఆర్ దానిని అమలు చేశారు. నిజంగానా రైతు కుటుంబాల్లో ఆశలు నింపింది. వట్టిపోయిన తెలంగాణలో వ్యవసాయాన్ని లాభదాయకం చేయడం అంత ఆషామాషీ కాదు. నదులు జీవం కోల్పోయాయి. చెరువులు ఆనవాళ్లు లేకుండా చేశారు. విద్యుత్ అందకుండా చేశారు. ఈ దశలో తెలంగాణ ఏర్పడ్డ తొమ్మిదేళ్లలో అద్భుతాలు రావాలని కోరుకోవడం అత్యాశే అవుతుంది. అయినా అడుగులు పడ్డాయి. రైతులకు కరెంట్ అందుతోంది. చెరువుల పూడికతీత ముమ్మరంగా సాగుతోంది.

దీంతో చెరువుల్లో నీరుచేరి ఊళ్ళు కళకళలాడుతున్నాయి. ఇక ప్రాజెక్టుల పనులు శరవేగంగా సాగుతున్నాయి. అయినా వీటితోనే రైతులు బాగు పడ్డాయని ఎవరూ అనడం లేదు. అలాగే పాలకుడైన సిఎం కెసిఆర్ కూడా అనడం లేదు. నిజాయితీగానే వ్యవసాయాన్ని పండగ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామనే చెబుతున్నారు. రైతును నష్టాల ఊబిలోంచి లాగడమంటే రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం అన్నది కెసిఆర్‌కు తెలియంది కాదు. నిజంగా కెసిఆర్ ప్రకటించిన విధానాలు వ్యవసాయాన్ని బలోపేతం చేస్తాయనడంలో సందేహం లేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా చేసిన ఆలోచనగా భావించాలి. కల్తీ విత్తనాలు అమ్మేవారిపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించారు. రైతులకు జరిగిన నష్టాన్ని కంపెనీలే చెల్లించేలా చట్టం తెస్తామన్నారు. ఇంతకంటే రైతు మరేం కోరుకుంటాడు.

పాలకులు ఏదైనా పథక రచన చేస్తే దానిని అమలు చేయించుకునే బాధ్యత విపక్షాలపైనా ఉంటుంది. విమర్శలకే ప్రతిపక్షాలు పరిమితం కారాదు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. రైతుల్ని సంఘటితం చేసి, అవసరమైన పంటలను పండించే క్రమంలో కూడా ఆలోచనలుచేస్తున్నారు. తెలంగాణను పంటల కాలనీలుగా విభజించి,ఇకపై ఏ జిల్లాలో ఏ పంటలు వేయాలో నిర్ణయిస్తామన్న ప్రకటనవల్ల అందరూ ఒకే రకమైన పంటలు వేసి నష్టపోకుండా చూడడం జరుగుతుంది.

## దశాబ్దివేళ పంచాయితీల్లో
# కానరాని కళ

మొదటిపేజీ తరువాయి..
వారీగా చెల్లిస్తున్నామని సంబంధిత శాఖ మంత్రి చెబుతున్నా.. అది ఎక్కడా అమలు కావడంలేదు. ఒక్కో గ్రామ పంచాయతీలో రూ. 10 నుంచి 50 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని గ్రామాలకు కొంతమేర మాత్రమే నిధులు విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని సర్పంచులు ఆరోపిస్తున్నారు. ఇక రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు జూన్ 2న రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను వైభంగా నిర్వహించాలని సర్కార్ నిర్ణయించింది. 21 రోజుల పాటు ఉత్సవాలు జరపాలని.. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది.

## ప్రత్యామ్నాయ రాజకీయాలకు
# దిక్సూచి కెసిఆర్

మొదటిపేజీ తరువాయి..
అందుకే కెసిఆర్ ప్రతిపాదనలపై కలసి నడిచేందుకు ఎవరు కూడా ముందుకు రాలేదు. అందుకే కెసిఆర్ బిఆర్‌ఎస్‌తో ముందుకు నడవాలన్న ప్రయత్నం చేస్తున్నారు. ఎవరు కలసి వచ్చినా రాకున్నా ప్రజల్లో మార్పు వస్తే చాలన్న ధోరణిలో ముందుకు సాగుతున్నారు. గుణాత్మక రాజకీయాలు అంటున్న కెసిఆర్.. మాటలు చూశాక..మోడీ వైఫల్యాలపై కూడా చర్చించాలి. గత పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఈ ప్రతిపాదనలు తీసుకుని వచ్చిన కెసిఆర్ ఆనాటి ప్రాంతీయ పార్టీల నేతలు అందరినీ కలిసారు. ఇందులో మమతా బెనర్జీ కూడా ఉన్నారు. మమతా బెనర్జీని కెసిఆర్ ప్రత్యేకంగా కలసి ఉమ్మడి ఫ్రంట్ ఏర్పాటు చేద్దామని ప్రతిపాదించారు. కానీ దీనిని తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ పెద్దగా పట్టించుకోలేదు. ఔనని కానీ..కాదని కానీ చెప్పకుండా తృణీకరించారు. నిజానికి మూడేళ్ల క్రితమే మమతను కలిసినప్పుడు..ఆనాడే ఓ నిర్ణయానికి వచ్చి వుంటే ఇవాళ కెసిఆర్ నేతృత్వంలో ఓ ఫ్రంట్ బలపడేది. దేశంలో సమైక్య ప్రతిపక్షం ఏర్పర్చేం దుకు 2019 లోక్ సభ ఎన్నికల ముందునుంచీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ వివిధ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం వల్ల అది ఇంత వరకూ సాధ్యం కాలేదు. తరవాత కార్యక్షేత్రంలోకి దిగిన కెసిఆర్ ప్రయత్నాలను ఎవరూ పెద్దగా స్వాగతించలేదు. దీంతో ఆయన కూడా వెనక్కి తగ్గారు. కాని ప్రస్తుతం దేశంలో విశ్వసనీయ ప్రత్యామ్నాయం ఏర్పడేందుకు సమయం ఆసన్నమయ్యింది. గవర్నర్ల అధికారాలను దుర్వినియోగ పరచడం, సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర సంస్థలను తమకు అనుకూలంగా వాడుకోవడం, రాష్ట్రాల నిధుల్ని తొక్కిపెట్టడం, జాతీయ అభివృద్ధి మండలి, ప్రణాళికా సంఘం వంటి సంస్థల్ని రద్దు చేయడం, బీజేపీయేతర ప్రభుత్వాల్ని పడగొట్టేందుకు వెనకాడకపోవడం,జాతీయ ఆస్తులను విశృంఖలంగా ప్రైవేటు పరం చేయడం, కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలు క్షీణించడం మొదలైన వాటిని చూస్తూనే ఉన్నాం. అవకాశం వస్తే సిఎం కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో నిర్ణాయక శక్తిగా మారగలరు. మోడీకన్నా మెరుగైన పాలన అందించగలరు.

# కాంగ్రెస్‌ది కొంగ జపం..బిజెపిది దొంగజపం

మొదటిపేజీ తరువాయి..
తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెట్టిన మోడీ ఏడు మండలాలు ఆంధ్రాలో విలీనం చేశాడని మంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కొంగ జపం చేస్తుండగా, బీజేపీ దొంగ జపం చేస్తున్నదని మంత్రి జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. ప్రజల బాగుకోసం కాకుండా అధికారమే పరమావదిగా ఆ పార్టీలు పనిచేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలపై బీజేపీ, కాంగ్రెస్‌ల ధోరణిని తీవ్రంగా దుయ్యబట్టారు. అధి కారం కోసం జరుగుతున్న పరుగు పందెంలో బీఆర్ఎస్ పార్టీతో పోటీ పడేందుకే దశాబ్ది ఉత్సావాలను రాజకీయం చేయాలనుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఉద్యమ సమయంలో రాజీనామాలు అంటేనే తోకముడిచిన ఆ రెండు పార్టీలకు దశాబ్ది ఉత్సవాల గురించి మాట్లాడే నైతికత ఎక్కడిదని ప్రశ్నించారు. తెలంగాణను చీకట్లోకి నెట్టిన కాంగ్రెస్ ఆవిర్భావ ఉత్సవాలను ఎలా చేస్తుందని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే బీజేపీకి ఆవిర్భావ ఉత్సవాలు చేసే అర్హత ఉందా అని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలోకి రాగానే 500 మెఘావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంతో సహా ఏడు మండలాలను ఆంధ్రలో కలిపిన ఆ పార్టీకి తెలంగాణ గురుంచి మాట్లాడే హక్కు ఏక్కడదని ౹÷రైయ్యారు. రాష్ట్రం కోసం రాజీనామా చేయమంటే పారిపోయిన కిషన్ రెడ్డి ఇప్పుడు తెలంగాణపై మాట్లాడితే ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. తొమ్మిదేండ్లలో ఊహకు మించిన అభివృద్ధిని సాదించుకున్నందుకే దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అంతటి అభివృద్ధిలో భాగస్వామ్యమైన బీఆర్ఎస్ శ్రేణులు దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో వెలుగు జిలుగులు విరజిమ్ముతున్నాయని తెలిపారు. వరిదిగు బడిలో సాధించిన విజయాలు సీఎం కేసీఆర్ పాలనా దక్షతకు తార్కాణమని మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు.

# మీరే నా బలం.. మీరే నా బలగం

మొదటిపేజీ తరువాయి..
ప్రేమగా మంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సీఎం కేసీఆర్ అయ్యాక అవ్వ, తాతల గౌరవం పెరిగింది అని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ రాకపోతే ఇంత అభివృద్ధి జరిగేదా అంటూ.. గత గ్రామ అనుభవాలు గుర్తు చేసి, ఇవాళ జరిగిన గ్రామ అభివృద్ధిని వివరించారు. కాళేశ్వరం నీళ్లతో మండుటెండలలో చెరువులు నిండు కుండలుగా తలపిస్తున్నాయని వివరించారు. ఎవ్వరైనా సరే సద్దితిన్న రేవు తలవాలని కోరారు. రూ.200 పింఛన్ రూ.2 వేలు చేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బోర్లు వేసినా నీళ్ల పడక బాధపడ్డారని, తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ హయాంలో ఆ బాధ తప్పిందని, ప్రజలకు ఏం కావాలో ఆలోచన చేసి ఇచ్చే సంక్షేమ ప్రభుత్వం మనదని మంత్రి హరీశ్ వెల్లడించారు. గతంలో బోరు బావులు తవ్వి డబ్బులు వృథా చేసుకున్నారని, ఇవాళ కాళేశ్వరం నీటితో రెండు పంటలు పండించుకుంటున్నామని నాటి-నేటి పరిస్థితిని హరీశ్‌రావు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎరువుల కొరత ఉండేదని, కానీ ఇవాళ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రైతుల కోసం 24 గంటల నిరంతర విద్యుత్, ఎరువులు తదితర రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం తలపెట్టిన అంశాలు వివరించారు.రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి అండగా ఉంటామని మంత్రి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. మొదటి విడతలో 40-50 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామ లైబ్రరీకి వారంలో ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తానని హామీనిచ్చారు. గ్రామంలో 808 రైతులకు రైతుబంధు, అనివార్య కారణాలతో మృతి చెందిన 14 మంది రైతు కుటుంబాలకు రైతుభీమా ఇచ్చి ఆదుకున్నామని తెలిపారు. గ్రామంలో ఇటీవల శిక్షణ పొందిన 21 మందికి కుట్టు మిషన్లు త్వరలోనే అందిస్తామని మంత్రి హామీనిచ్చారు.అంతకుముందు 30 రోజుల ప్రణాళికతో మంత్రి సహకారంతో మల్యాల గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నామని గ్రామ ప్రజాప్రతినిధులు వివరించారు. గ్రామంలో 18 రకాల అభివృద్ధి పనులు చేసుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు తీపికబురు

## రాష్ట్రావతరణ సందర్భంగా డిఎ పెంపు

హైదరాబాద్,జూన్1 (ప్రజా మంటలు) : రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు ఆర్టీసీ యాజమాన్యం



తీపికబురు అందించింది. మరో డీఏ ఇవ్వాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. జూన్ నెల వేతనంతో కలిపి డీఏ చెల్లించనుంది. ఉద్యోగులకు డీఏ ఇస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ప్రకటించారు. జులై 2022 లో ఇవ్వాల్సి ఉన్న 4.9 శాతం డీఏను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ నెల వేతనంతో కలిపి డీఏను ఉద్యోగులకు సంస్థ చెల్లిస్తుందని ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులు క్రియాశీల పాత్ర పోషించారు. 2011లో దాదాపు 29 రోజుల పాటు సకల జనుల సమ్మెలో పాల్గొని ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కానుకగా పెండింగ్ లో ఉన్న ఏడో డీఏను ఉద్యోగులకు మంజూరు చేయాలని టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇప్పటివరకు ఏడు డీఏలను సంస్థ మంజూరు చేసింది. మిగిలిన ఒక్క డీఏను త్వరలోనే ఉద్యోగులకు ప్రకటిస్తుంది అని టీఎస్‌ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు.

## అయోధ్యలో చురుకుగా
# రామాలయ నిర్మాణం

## గర్భగుడి పనులకు సిఎం యోగి శంకుస్థాపన
## 2023 డిసెంబర్‌లోగా ఆలయ గర్భగుడి పనులు పూర్తి

లక్నో,జూన్1 (ప్రజా మంటలు) : అయోధ్య రామాలయం పనులు శరవేగంగా సాగుతున్నాయి. డిసెంబర్ కల్లా ఈ పనులు పూర్తవుతాయని కమిటీ అంచనా వేస్తోంది. శిలాపూజ కార్యక్రమం అనంతరం గర్భగుడి పనులు ప్రారంభమయ్యాయి. 2023 డిసెంబర్‌లోగా ఆలయ గర్భగుడి పనులు పూర్తవుతాయని రామాలయ పనులు చూసుకుంటున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆశాభావం వ్యక్తం చేసింది. 2024లోగా ఆలయ నిర్మాణం, 2025లోగా ఆలయ సముదాయంలోని ఇతర నిర్మాణాలు పూర్తవుతాయని రామమందిరం నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా చెప్పారు. 2.7 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. మందిరం పొడవు 360 అడుగులు, వెడల్పు 235 అడుగులు ఉండనుంది. మూడు అంతస్తులతో నిర్మించనున్న ఈ మందిరం ఎత్తు 161 అడుగులు ఉంటుంది. రెండున్నర అడుగుల పొడవు ఉన్న 17 వేల రాళ్లను మందిరం నిర్మాణంలో ఉపయోగిస్తున్నారు. అయోధ్యలో రామాలయం నిర్మాణానికి మార్గం సుగమం చేస్తూ 2019లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. 2020 ఆగస్టు 5న అయోధ్య రామ మందిర నిర్మాణం లాంఛనంగా



ప్రారంభమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. వేద మంత్రాల మధ్య ఆలయానికి పునాది రాయి వేశారు. అప్పటి నుంచి నిర్మాణ పనులు చకచకా జరిగిపోతున్నాయి. వచ్చే ఎన్నికల్లోగా దీనిని పూర్తి చేయాలన్న సంకల్పం కనిపిస్తోంది.

# సిద్దపేటకు రైలు కూతపెట్టాలి

## నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
## పనులను క్షేత్రస్థాయిలో పరిశాలించిన మంత్రి

సిద్దిపేట,జూన్1 (ప్రజా మంటలు) : సిద్ధిపేట శివారు మందపల్లి నుంచి రైల్వే ట్రాక్ లైను పనులు రాష్ట్ర ఆర్థిక, వైద్యఆరోగ్య మంత్రి హరీష్‌రావు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సిద్ధిపేటకు



తొందరలోనే రైలు కూత వచ్చేలా యుద్ధప్రాతిపదికన రైల్వే ట్రాక్ పనులు పూర్తి చేయాలని రైల్వే శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. సిద్ధిపేట రైల్వే ట్రాక్ నిర్మాణ పనుల్లో జాప్యం జరగొద్దని, పనుల వేగం పెంచాలని రైల్వే శాఖ అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు.గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, రైల్వే శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ సంతోష్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమరాజు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జనార్ధన్ బాబు, సిద్ధిపేట ఆర్డీఓ రమేశ్ బాబు, ఇతర అధికార యంత్రాంగంతో కలిసి క్షేత్రస్థాయి రైల్వే ట్రాక్ పనులను మంత్రి పరిశీలించారు. దుదెడ - సిద్ధిపేట వరకూ రైల్వే ట్రాక్ నిర్మాణ పనులలో భాగంగా చేపట్టిన ట్రాక్ నిర్మాణ పనుల గురించి మంత్రికి రైల్వే శాఖ అధికారులు వివరించారు.

దుదదెడ - సిద్ధిపేట రైల్వే ట్రాక్ పనులలో భాగంగా మందపల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ జాప్యంపై ఆరా తీసి, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని రైల్వే శాఖ అధికారులను మంత్రి హరీష్‌రావు ఆదేశించారు.

# మూడోసారి... అధికారం మాదే

మొదటిపేజీ తరువాయి..
వెళ్లడంలోనూ, ప్రజల దృష్టిలో వెనుకబడిన ఎమ్మెల్యేలు తమ ప్రదర్శన మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ అవతరణను పురస్కరించుకుని తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మాతో పోటీపడే స్థితిలో కాంగ్రెస్ పార్టీ లేదు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ భమల్లో ఉంది. రాష్ట్రంలో షర్మిల, కేఏ పాల్ అధికారంలోకి వస్తామని చెబుతున్నారు. వారిది కూడా భ్రమనే అని కేటీఆర్ పేర్కొన్నారు. వారు ఊసులోనే లేరని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతిపక్షాలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్ర ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలకు కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణ కన్నా ఉత్తమ పాలన ఏ రాష్ట్రంలో ఉందో చెప్పాలి. తెలంగాణ కన్నా మెరుగైన మోడల్ రాష్ట్రాన్ని చూపించాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. 75 ఏండ్లు పాలించిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు ఏం చేశాయి. మేం 9 ఏండ్లలో అభివృద్ధిలో అద్భుతాలు చేసి చూపించాం. బీజేపీ, కాంగ్రెస్ పరిపాలన కొత్త సీసాలో పాత సారా మాదిరి. కేంద్ర మంత్రులు టాయిలెట్స్, రైల్వేస్టేషన్లలో లిఫ్టులు ఓపెన్ చేస్తున్నారు. మేం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టులు కడుతున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ఇతర రాష్ట్రాల్లో పోటీ చేసే దిశగా ఆలోచిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్‌లోనూ మా పార్టీ కార్యక్రమాలు ప్రారంభించిందని కేటీఆర్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ సీఎం అభ్యర్థి ఎవరో చెప్పే దమ్ము ఉందా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఒక పార్టీ కాకుండా ఎన్జీవో, దుకాణాన్ని నడుపుకోవాలి. గుజరాత్‌లో ఎన్నికలు జరుగుతుంటే రాహుల్ పారిపోయాడు. పీవీ నరసింహారావును అవమానించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది అని కేటీఆర్ పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం గద్దె దిగాల్సిన అవసరం ఉంది. బీజేపీకి దమ్ముంటే దేశానికి చేసిన మంచి పనులు ఏంటో చెప్పాలి. నోట్ల రద్దుతో ఏం సాధించారో మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఇప్పుడు రూ. 2 వేల నోట్ల రద్దుతో సాధించింది ఏంటో కూడా చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు.. లేని నిరుద్యోగం గురించి ఇక్కడ నిరసనలు చేస్తున్నారు. మేం విదేశీ పర్యటనలు చేసి వేలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాం. తాజా పర్యటనతో 42 వేల మందికి ఉద్యోగ అవకాశాలు తీసుకొచ్చాం అని కేటీఆర్ తెలిపారు. ఓఆర్ఆర్ టెండర్ పక్రియ నేషనల్ హైవే టెండర్ మాదిరే జరిగింది అని కేటీఆర్ తెలిపారు. ప్రతిపక్షాల ఆరోపణలపై మున్సిపల్ శాఖ ఏ విచారణకైనా సిద్ధమని ప్రకటించింది. లీగల్ నోటీసులకు సమాధానం చెప్పాలి. చిల్లర మాటలు, ఆరోపణలు చేయడం ప్రతిపక్షాలు మానుకోవాలి అని కేటీఆర్ హెచ్చరించారు. మైనార్టీలకు తెలంగాణ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను పక్క రాష్ట్రాల్లో పొగిడిన ఓవైసీ ఇక్కడ ఎందుకు విమర్శలు చేస్తున్నారు అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తారన్నది ఎంఐఎం పార్టీ ఇష్టం. ప్రజలు మత ప్రతిపాదికన ఓట్లు వేస్తారని నేను నమ్మను. మంచి ప్రభుత్వాన్ని మతాలకతీతంగా ఎన్నుకుంటారని నమ్ముతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ లేనే లేదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలోనే బీజేపీ హంగామా అని ఆయన పేర్కొన్నారు. సౌత్ ఇండియా వర్సెస్ నార్త్ ఇండియా అనేది నా వాదన కాదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. జనాభా నియంత్రణ చేపట్టిన రాష్ట్రాలు నష్టపోకూడదన్నదే నా వాదన. ప్రజాస్వామ్యంలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు ఉండాలి. యూపీ లాంటి రాష్ట్రంలో పెరిగే సీట్ల మొత్తం దక్షిణాది రాష్ట్రాల సీట్ల కన్న ఎక్కువ. దేశ ప్రగతికి మద్దతు ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకూడదు. అలాంటి పరిస్థితి వస్తే ఎవరూ సహించరు. లోక్‌సభ స్థానాల పెంపుపై ఆరోగ్యవంతమైన చర్చ జరగాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ గత 10 ఏండ్లుగా నీళు ౢ, నిధులు, నియామకాలన్న స్ఫూర్తికి అనుగుణంగా పని చేస్తోందని కేటీఆర్ తెలిపారు. అందులో తెలంగాణ విజయం సాధించింది. సమగ్ర, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధి సాధించింది. విద్య, వైద్య రంగంలో తెలంగాణలో అద్భుతమైన మార్పులు సాధించింది. మెడికల్ కాలేజీల ఏర్పాటుతో సమగ్రమైన మార్పు వచ్చింది. విద్యారంగంలో గుణాత్మకమైన మార్పు సాధించాం. తెలంగాణలో పరిపాలన సంస్కరణలు దేశంలో ఎక్కడా లేవు. అన్ని రంగాల్లో తెలంగాణ తనదైన మార్క్‌ను చాటింది. తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తోంది అని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలకు పని లేకుండా పోయింది అని కేటీఆర్ ధ్వజమెత్తారు. 9 ఏండ్లుగా ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రతిపక్షాలు చేసే ఆరోపణల్లో హేతుబద్ధత లేదు. చేతిలో ఉన్న రూపాయిని పారేసి చిల్లర ఏరుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. చిల్లర రాజకీయాలు చేసే నాయకులను ప్రజలు పట్టించుకోరు. మన పాలనను ఇతర రాష్ట్రాల పాలనతో బేరీజు వేసుకోవాలి. ఒకప్పుడు పంటలు పండని చోట నేడు ధాన్యం ఎక్కువైన పరిస్థితి నెలకొంది. ధాన్యం కొంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు.



హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఈరల్ల చిన్న మల్లయ్య ఇటీవల గుండెపోటుతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.4000/-రూపాయలు సహాయం అందజేసిన మంజులరెడ్డి. కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు. వీరి వెంట గ్రామ యువత గుగులోత్ శేఖర్, అప్పీస చిరంజీవి, ఈరల్ల ఉదయ్ కుమార్, గ్రామస్తులు ఉన్నారు.

## ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన వేద పండితులు

కొడిమ్యాల జూన్ 01 (ప్రజామంటలు): కొడిమ్యాల మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పునర్నిర్మానంలో భాగంగా ఆలయంలో జరుగుతున్న నిర్మాణ పనులను వేద పాఠశాల గురువు, ఆధ్యాత్మికవేత్త, వేద పండితులు శ్రీ జగన్నాథం విష్ణువర్ధనాచార్యులు తన శిష్య బృందంతో



పర్యవేక్షించారు వేద పండితులు ఆలయంలో ఆలయ పరిసరాల్లో జరుగుతున్న ఉపాలయాలు, మెట్లు,ప్రహరీ గోడ, స్టోర్, యాగశాల, గోశాల, నీటి ట్యాంకు నిర్మాణాలను వైష్ణవ ఆగమశాస్త్ర పద్ధతిలో నిర్మాణాలు చేపట్టాలని ఇప్పటివరకు నిర్మాణం జరిగిన తీరు ఒక క్రమ పద్ధతిలో నిర్మాణం జరిగిందని ఇకపై జరగబోయే నిర్మాణాలకు మరియు ప్రతిష్టాపన ఖర్చులకు ధన వస్తు రూపేనా సమకూర్చుకోవాలని నిర్మాణ కమిటీకి సభ్యులకు, గ్రామస్తులకు తెలియజేయడం జరిగింది. ప్రజలు, భక్తులు అన్ని విధాలుగా సహకరించగలరని తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ అర్చకులు, నిర్మాణ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

ధర్మసాగర్ జూన్ 01 (ప్రజామంటలు): పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిది పథకం అండగా నిలుస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. గురువారం సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన కంచర్ల లింగయ్య రూ.37000,



చల్లగొండ గాలి రెడ్డి లకు రూ. 35000. ఎంపీటీసీ వల్లపు రెడ్డి రమాదేవి ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కి, ఎన్ఆర్ఐ రామ్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పుట్ట కుమార్, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.


## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చిగురుమామిడికి కాయకల్ప అవార్డు

### మండల వైద్యాధికారి డా. ధర్మ నాయక్

చిగురుమామిడి జూన్ 01 (ప్రజామంటలు): ఫైనాన్షియల్ 2022-23 సంవత్సరమునకు గానూ కరీంనగర్ జిల్లాలో చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం "బెస్ట్ పిహెచ్‌సి" గా కాయకల్ప అవార్డు గెల్చుకుందని డా. ధర్మ నాయక్ తెలిపారు. ఇందులో స్వచ్ఛ భారత్ అభియాన్, హాస్పిటల్లో ఇన్ఫెక్షన్ అదుపు చేయడం, హాస్పిటల్లో ఆరోగ్య సేవలు, హాస్పిటల్ పరిసరాల పరిశుభ్రత పాటించడం, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ తదితర అంశాలలో 85.30 శాతం మార్కులు సాధించి కరీంనగర్ జిల్లాలో మొదటి స్థానం సాధించి రూ. 2,00,000 లను గెల్చుకుంది. ఇందుకు గాను సహకరించిన జిల్లా కలెక్టర్ కర్ణన్ సార్ కి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ మేడమ్ కి,జిల్లా వైద్యాధికారి డా.శ్రీ లలితా దేవీ మేడమ్ కి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.జువెరియ మేడమ్ కి ధ్యవాదములు తెలిపారు. ఇందుకు గాను సహకరించిన పిహెచ్‌సి వైద్య సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.



ఈ అవార్డు ప్రతిఫలంతో ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్ కూడ గెలుచుకుంటామని, తద్వారా మండల ప్రజలకు మరింత అరోగ్య సేవలు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.



# మేమెంతో మాకంత

### మేపా ( ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) డిమాండ్

### రాష్ట్రంలో 60లక్షల జనాభా ఉన్న ముదిరాజ్ కులస్థుల రిజర్వేషన్లపై డిమాండ్

### మంత్రి హరీష్ రావుకు వినతి

### బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏ లోకి మార్చాలి

హనుమకొండ జూన్ 01 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్రంలో సుమారు 60లక్షల జనాభా ఉన్న ముదిరాజ్ కులస్థులు సరైన రిజర్వేషన్లకు నోచుకోవడం లేదని, "మేమెంతో మాకంత" అనే నినాదంతో వెంటనే ప్రస్తుతం ఉన్న బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చడానికి తగిన చర్యలు తీసుకోవాలని లేదా ప్రత్యేక రిజర్వేషన్ బీసీ (ఎఫ్) ను ప్రవేశపెట్టాలని, ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసి యేషన్ (మెపా) ఆధ్వర్యంలో ఆర్థిక, వైద్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు కు, ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కు వినతి పత్రం సమర్పించి, ఉగాది డైరీని ఆవిష్కరించారు.

### రూ. 1000 కోట్లతో ముదిరాజ్ కార్పొరేషనను ఏర్పాటు చేయాలి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీష్ రావు ను మెపా బాధ్యులు కలిసి తమ కమ్యూనిటీ సమస్యలను విన్నవించారు. తమను వెంటనే బీసీ-ఏలోకి మార్చాలని, లేదంటే ప్రత్యేక రిజర్వేషన్ గ్రూపు (ఎఫ్) ను ఏర్పాటు చేయాలని కోరారు. తమకు రిజర్వేషన్ కల్పించడానికి వస్తున్న అడ్డంకులను తొలగించడానికి ముదిరాజ్ జనాభాను లెక్కించాలని, అందుకు కావాల్సిన కార్యాచరణ ఎన్నికలలోపే ప్రారంభించేలా కృషిచేయాలని కోరారు. రూ. 1000 కోట్లతో ముదిరాజ్ కార్పొరేషనను ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని విన్నవించారు. ఇటీవల పిట్టల రవీందర్ ముదిరాజ్ ను రాష్ట్రప్రభుత్వం తగిన విధంగా గుర్తించడం హర్షణీయమని, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ మేధావులను కూడా గుర్తించి తగిన పదవులు ఇవ్వాలని కోరారు. రిజర్వేషన్లు అడుక్కోవడం లేదు పాలనాపరమైన సమస్యలు తొలగించి మా హక్కులు మాకు ఇవ్వాలని కోరుకుంటున్నామన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. దీంతో మెపా ప్రతినిధులు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్,మెపా రాష్ట్ర కమిటీ సభ్యులు రిటైర్డ్ ప్రొఫెసర్ డా. చింతకాయల దినేష్‌కుమార్, డా. కట్ల శ్రీనివాస్, రేగుల మొగిలి, పెండెం మధుసూదన్, పోతిరెడ్డి సత్తయ్య, కొత్తగట్టు కృష్ణ, బండారి రాము, గూళ్ల సత్తయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అనవసరమైన అత్యవసర సమావేశం అంటూ మున్సిపల్ కౌన్సిల్‌ను వాకౌట్ చేసిన బిజెపి

జనగామ జూన్ 01 (ప్రజామంటలు): జనగామ మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో బిజెపి మున్సిపల్ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త మాట్లాడుతూ అత్యవసర సమావేశం ప్రజలకు సంబంధించిన విషయంలో ఫ్లడ్స్ వచ్చినపుడు కానీ ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో కానీ ప్రజలకు అత్యవసర సేవలు అందించే సమయంలో భవిష్యత్తులో ఏదైనా ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నప్పుడు ప్రజావసరార్థం ఫండ్స్ అవసరాల కోసం వాడుకోవడం కోసం మాత్రమే అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని ఉంటే అలా కాకుండా తమ అవసరాల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం మంచి పద్ధతి కాదని, ఇది ప్రజల కష్టపడి కట్టిన టాక్స్ ను దుర్వినియోగం చేయడం కోసమే మాత్రమేనని అన్నారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరం లేనిది ప్రజలకు ఉపయోగపడనివి ఎజెండాలో పెట్టడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బిజెపి కౌన్సిలర్లు మహంకాళి హరిశ్చంద్ర గుప్త, ఉడుగుల శ్రీలత వాకౌట్ చేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్ జక్కుల అనిత, వంగాల కళ్యాణి మాట్లా డుతూ.... తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ కోసం జరుగు ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వ భరించాలని మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ లో డబ్బు లేనందున ఎమ్మెల్యే చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం నుండి డబ్బు కేటాయించేలా చూడాలని కోరారు. కౌన్సిలర్ బండ పద్మ మాట్లాడుతూ.... గతంలో పండగ సందర్భంలో పోచమ్మ టెంపుల్ కు వేసిన లైటింగ్ ఖర్చులను కౌన్సిల్ ఆమోదం చేసిన బిల్లు పాస్ అయినా కూడా ఇంతవరకు బిల్లు చెల్లించలేదని నిలదీశారు. ఈ కార్యక్రమంలో తాళ్ల సురేష్ రెడ్డి మంత్రి సుమలత, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ గంగరబోయిన మల్లేష్, దేవర నాగరాజు, కోఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రజిత, మున్సిపాలిటీ డిఇ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కానుక

### టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు మరో డీఏ

హైదరాబాద్ జూన్ 01 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు సంస్థ తీపి కబురు చెప్పింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కానుకగా మరో విడత కరువు భత్యం (డీఏ) ఇవ్వాలని నిర్ణయించినట్లు టీఎస్ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, సంస్థ ఎండీ వీసీ సజ్జనార్, ఐపీఎస్ వెల్లడించారు. జులై 2022 లో ఇవ్వాల్సి ఉన్న 4.9 శాతం డీ.ఏ. ను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ నెల వేతనంతో కలిపి డీఏను ఉద్యోగులకు సంస్థ చెల్లిస్తుందని ప్రకటించారు. "తెలంగాణ ఉద్యమంలో టీఎస్ఆర్టీసీ ఉద్యోగులు క్రియాశీల పాత్ర పోషించారు. 2011లో దాదాపు 29 రోజుల పాటు సకల జనుల సమ్మెలో పాల్గొని ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కానుకగా పెండింగ్ లో ఉన్న ఏడో డీఏను ఉద్యోగులకు మంజూరు చేయాలని టీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇప్పటి వరకు ఏడు డీఏలను సంస్థ మంజూరు చేసింది. మిగిలిన ఒక్క డీఏను త్వరలోనే ఉద్యోగులకు ప్రకటిస్తుంది." అని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, సంస్థ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ తెలిపారు.





## మృతురాలి కుటుంబానికి ఎన్ఆర్ఐ రామ్ రెడ్డి చేయూత

### 50 కిలోల బియ్యం అందజేత

ధర్మసాగర్ జూన్ 01 (ప్రజామంటలు): మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన వేములకొండ వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను నారాయణగిరి గ్రామానికి చెందిన వల్లపురెడ్డి రాంరెడ్డి చేయుత నందించారు. ఈ మేరకు గురువారం రామన్న యువ సేన ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యంను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మడికంటి రాజయ్య, మాజీ ఉపసర్పంచ్ పుట్ట కుమార్, మాజీ ఎస్ఎంసి చైర్మెన్ కోతి సాంబరాజు, ముప్పారం ఉపసర్పంచ్ భిక్షపతి, కుమారస్వామి, గంటే కృష్ణ, వేములకొండ కుమార్, మజ్జిగ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ పోటీల్లో రాణించిన రేవంత్

### వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో థర్డ్ ప్రైజ్

సికింద్రాబాద్ జూన్ 01 (ప్రజామంటలు): సీతాఫలమండికి చెందిన జి.యం. రేవంత్ గత నెల 30, 31 తేదిల్లో ఎల్బీ స్టేడియంలో జరిగిన చీఫ్ మినిస్టర్ కప్ వెయిట్ లిఫ్టింగ్ 55 కేటగిరి పోటీల్లో స్నాచ్, 62 క్లీన్ అండ్ జర్క్ లో 81 కిలోలు లిఫ్ట్ చేసి మూడవ స్థానంలో నిలిచి బ్రౌంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. శాట్స్ ఛైర్మన్ ఈ. ఆంజనేయ గౌడ్ విన్నర్ రేవంత్ కు బ్రౌంజ్ మెడల్ ను అందచేసి, అభినందించారు. ఈసందర్భంగా విజేత లిఫ్టర్ రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.... తనకు ట్రైనింగ్ ఇస్తున్న గురువు శివ, శ్రవన్, హైదరాబాద్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, కోచ్ హేమ, పోడేటి రాజు లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా సీఎం కప్ పోటీల్లో ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచిన రేవంత్ కు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. మరింత శిక్షణ తీసుకొని, భవిష్యత్ లో దేశానికి పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.






పీవీ స్వగ్రామం వంగరలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి. అనంతరం పివి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. వారితో పాటుగా వొల్లాల రమేష్, మాజీ పిసిసి సభ్యులు చిట్టంపల్లి అయిలయ్య, ఆర్. వెంకట్ రెడ్డి, సతీష్ రెడ్డి, తిరుపతి రెడ్డి, కండే రమేష్, మొండయ్య, సుదర్శన్ రెడ్డి, డబ్బా శంకర్, బొట్టు మొగిలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.







# రాజకీయాల్లో కెసిఆర్‌ది సక్సెస్ ఫార్ములా!

ప్రణాళికాబద్ధ రాజకీయాలకు పెట్టింది పేరు కెసిఆర్. తెలంగాణ ఉద్యమాన్ని,ఆటుపోట్లను బాగా ఔపోసన పట్టిన తరవాతనే.. దాన్ని సాధించేందుకు ఎంచుకున్న మార్గంలో ఓ సక్సెస్ ఫార్ములాను ఆయన అనుసరించారు. ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను ఇక్కట్లను ఎలా అధిగమించాలో కూడా ఆయన తన రోడ్ మ్యాప్‌లో నిర్దేశించుకున్నారు. రాకెట్ ప్రయోగం లో ఎలాంటి ప్రణాళిక ఉంటుందో తెలంగాణ సాధనలోనూ..తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లోనూ.. పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన ప్రణాళిక దాగివుంది. అందుకే ఆయన రాజకీయ జీవితం అప్రతిహతంగా కొనసాగుతోంది. గుడ్డెద్దు చేల్లో పడ్డట్లుగా కెసిఆర్ రాజకీయాలు చేయరని ఆయన సక్సెస్‌ను గమనించిన వారు చెబుతారు. గత ఎన్నికల్లో మరోమారు విజయం సాధించడంలోనూ.. ఎన్నికల ను ముందుకు జరిపి ముందస్తుకు వెళ్లడంలోనూ అనూహ్యమైన ప్రణాళిక ఉంది. ప్రజలనాడి పట్టకుండా రాజకీయాలు చేసే వారు ఫెయిల్ అవుతారు. ఇది బాగా ఎరిగిన వారు సక్సెస్ అవుతారు. అందుకే రాజకీయాల్లో కెసిఆర్ సాధించిన విజయాలు మరు పార్టీ లేదా నేత సాధించలేక పోతున్నారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన సందర్భంలో ఆయన విజయానికి ఇదే కారణం. కానీ ప్రణాళికా లోపంతో ఎన్టీఆర్ వంచనకు గురయ్యారు. ఎపిలో కూడా జగన్ ప్రజలనాడి తెలుసుకుని ..చంద్రబాబు వ్యతిరేకాంశాలతో పాదయాత్రలో ప్రజలకు నమ్మకం కలిగించారు. అందుకే అక్కడ అధికారంలోకి వచ్చారు. అయితే వచ్చిన అధికారం నిలబెట్టుకునేందుకు పడుతున్న తంటాలు వేరు. చంద్రబాబు కూడా మామను వెన్నుపోటు పొడిచినంత ఈజాగా ప్రజల్లో అనుకూలతను సాధించలేక పోయారు. దేశ రాజకీయాల్లో కెసిఆర్‌ది మాత్రమే ఓ సక్సె ఫార్ములాగా చెప్పుకోవాలి. ఇక తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను తలకెత్తు కునే ముందు కెసిఆర్ కూడా ఎంతగానో మేధోమధనం చేశారు. తను ఎంచుకున్న మార్గంలో ముళ్లు, రాళ్లు,ఎగుడుదిగుడులు ఉంటాయిని తెలిసీ..వాటిని ఎలా తొలగించుకుంటూ ముందుకు సాగాలో కూడా ప్రణాళిక మేరకు ముందుకు సాగారు. ఆయనను దగ్గరగా చూసిన వారికి ఆయన రచిస్తున్న వ్యూహాలు తెలుసు. నెలల తరబడి నిద్రాహారాలు కూడా మానేసి ఆయన ఓ రోడ్డు మ్యాప్ గీసుకుని ముందకు నడిచారు. ఆషామాషీగా ఆయన రంగంలోకి దిగలేదు... దిగిన తరవాత వెనుదిరిగి చూడలేదు. తెలంగాణ ఉద్యమంలో సాధించిన విజయంతో ప్రభుత్వాన్ని కూడా తను ఏర్పాటు చేస్తేనే సాధించుకున్న తెలంగాణ ఆకాంక్షలు సాకారం అవుతాయని భావించారు. అందుకే ఆయన వెంట ప్రజలు కూడా నమ్మకంగా నడిచారు. ప్రజల నాడిని పట్టి..వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగడం.. రాజకీయాల కోసం ఎత్తులు పై ఎత్తులు వేయడం కెసిఆర్‌కు మాత్రమే తెలిసిన విద్య. జాతీయ రాజకీయాల్లో ఆయన ఉండి వుంటే ఈ పాటికి వేరుగా ఉండేది. కెసిఆర్‌కు దేశం మీద అవగాహన ఉంది. నదుల



మీద..వాటి నడక మీదా అవగాహన ఉంది. అన్నింటికి మించి ప్రజల జీవన విధానంపై లోతైన అవగాహన ఉంది. ప్రపంచ గమనంపైనా అవగాహన ఉంది. ప్రపంచ రాజకీయా లతో పాటు, దేశ రాజకీయాలను బాగా ఔపోసన పట్టిన వ్యక్తి. దేశంలో మోడీతో పోల్చుకుంటే కెసిఆర్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయగల సత్తా ఉన్న నేత. దేశంలో ఉన్న వనరులు, వాటిని ఉపయోగించు కునే తీరు కూడా బాగా తెలిసిన వాడు. తెలంగాణలో 24 గంట నిరంతర విద్యుత్‌ను ఇవ్వగలిగడం లోనే ఆయన దార్శనికతను అర్థం చేసుకోవచ్చు. నిరంతర విద్యుత్ ఉంటే చిన్న,పెద్దా పరిశ్రమల ఉత్పత్తి రంగం దెబ్బతినదని కూడా బాగా తెలుసు. అందుకే నిరంతర విద్యుత్‌ను సాకారం చేసిన నేత.. నిజానికి దేశ వ్యాప్తంగా నిరంతర విద్యుత్ ఎందుకు ఇవ్వలేక పోతున్నారో ఇప్పుడు ఆలోచన చేయాలి. దేశంలో పారుతున్న నదులను కూడా ఎలా ఉపయోగించుకోవాలో కూడా బాగా తెలిసిన వ్యక్తి కెసిఆర్. అందుకు గోదావరి జలాలను ఎదురెక్కించి రిజర్వాయర్లను కట్టించిన తీరు అద్భుతం కాక మరోటి కాదు. కాళేశ్వరంతో మొదలు పెట్టి..కొండపోచమ్మ సాగర్ వరకు నీటి రాకను చూస్తే అద్భుతం అని చెప్పని వారు ఉండరు. ఒక రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చో.. అన్నది కేవలం ఈ తొమ్మిదేళ్లలో చేసి చూపారు. కాళేశ్వరంతో పాటు అనేక ప్రాజెక్టులను కట్టడం, చెరువులను పునరుద్ధరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోయడం, మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేయడం,హరితహారంతో పచ్చదనాన్ని పెంచి మొక్కల పెంపక ప్రాధాన్యాన్ని గుర్తించారు. జిల్లాల విభజనతో పాలనను ప్రజలకు చేరువ చేశారు. అన్నింటికి మించి యాదాద్రి ఆలయాన్ని నభూతో నభవిష్యత్ అన్న రీతిలో పునరుద్ధరించి..కాకతీయకళావైభవాన్ని కళ్లకు చాటారు. ఇవన్నీకూడా విప్లవాత్మక నిర్ణయాలే. ఇదే తరహాలో దేశ పగ్గాలు అందుకుంటే ఖచ్చింతంగా ఓ నాలుగైదేళ్లలో గణనీయమైన మార్పులు చూపి..ప్రజలకు ఆదర్శ నేతగా నిలిచే సత్తా కూడా కేవలం కెసిఆర్‌కు మాత్రమే ఉందనడంలో సందేహం లేదు. నిజానికి కెసిఆర్ బిజెపి లాంటి పార్టీలో ఉండివుంటే మోడీకి అవకాశం వచ్చేది కాదు. మోడీకి లేని విజన్ కెసిఆర్‌కు ఉందనడంలోనూ సందేహం లేదు. మోడీది ప్రచార ..పటాటోపం తప్ప మరోటి కాదు....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నేటికీ మోడీ పెద్దగా విజజయం సాధించలేదు. అందుకే రాజ్యాంగం కొత్తది రాసుకోవాలన్న కెసిఆర్ డిమాండ్ వెనక ప్రజల ఆకాంక్షలు బలంగా ఉన్నాయి. ప్రజల నాడిని పట్టిన నేతగానే కెసిఆర్ ఇలాంటి డిమాండ్ చేశారు. దీనిపై చర్చచేయకుండా కేవలం కెసిఆర్‌పై దుమ్మెత్తి పోస్తే కెసిఆర్‌కు పోయేదేమీ లేదు. కెసిఆర్ మాత్రమే దేశ రాజకీయాలపై దగ్గరగా అవగాహన కలిగి ఉన్నారు. దేశం పట్ల ఆయనకు ఓ స్పష్టమైన విజన్ ఉంది. అందుకే తెలంగాణ ఉద్యమంలో ఎవరెవరిని ఎలా వాడుకోవాలో అన్న ప్రణాళికతోనే కార్యక్షేత్రంలోకి దిగారు. తెలంగాణ అసృాద్యం అన్నదానిని సుసాధ్యం చేసి చూపారు. జాతీయ స్థాయిలో ఏయే రాజకీయ పార్టీతో నెయ్యం చేయాలో చేశారు. ఎవరెవరిని మచ్చిక చేసుకోవాలో చేసుకున్నారు. ఇలా తెలంగాణను సాకారం చేయడంతో పాటు, పాలనలో తనదైన ముద్ర వేయగలిగారు. ఇప్పుడంతా విమర్శి స్తున్నట్లుగా కెసిఆర్‌పై ప్రజల్లో పెద్దగా వ్యతిరేక కూడా లేదు. మెజార్టీ ప్రజలకు కెసిఆర్ అంటే కోపం కూడా లేదు. రాజకీయ పార్టీల హడావిడి , విమర్శలు తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇంతకుమించి చేయగలిగిన నేత ఇతర పార్టీల్లో లేరు.అంతెందుకు తెలంగాణలో కెసిఆర్‌ను మించిన విజినరీ నేత లేదనడంలో ఏమాత్రం అతిశయోక్తి కూడా లేదు. అందుకే నూరు కాదు..నూటి ఐదు సీట్లు గెలుస్తామన్న ధీమాలో కెసిఆర్ ఉన్నారు. ఈ ధీమా వెనక కూడా బృహత్తర ప్రణాళిక దాగివుంటుంది. అదే సాకారం అవుతుందని మరోమారు మనం గమనించక తప్పదు.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## రైతు కళాభిరుచి

ఒక రైతు తన మామిడి తోటలో పనిచేసుకుంటున్నాడు. ఇంతలో కొందరు పులి వేషం వేసిన కళాకారులు మరొక గ్రామం పోతూ ఎండ వేడిమికి తాళజాలక అతని తోటలోని మామిడి చెట్ల నీడ క్రింద నిలుచున్నారు. ఆ రైతు వారిని చూసి తోట లోపలికి రమ్మని ఆహ్వానించి కూర్చోమన్నాడు. ముందుగా వారి దాహాన్ని తీర్చాడు. కొద్దిసేపు వారు విశ్రాంతి తీసుకున్న తర్వాత అతడు మామిడి చెట్లను ఎక్కి తీయనైన



మామిడి పండ్లను తెంపి వారికి ఇచ్చి వారి ఆకలిని తీర్చాడు. తర్వాత వారి పులి ఆట తనకు ఇష్టమని వారిని ఆ ఆటను ప్రదర్శించమన్నాడు. వారు పులి ఆటను ప్రదర్శించారు. రైతు సంతోషించి తన కొరకు తెచ్చుకున్న రెండు కొత్త తెల్లని పట్టు పంచెలను వారి భుజాన కప్పి ఈ ఎండ నుండి అవి మిమ్మల్ని కాపాడతాయని అన్నాడు . వారు రైతు ఆతిథ్యానికి వారు ఎంతో సంతోషించి తర్వాత వారి గ్రామానికి వెళ్లి అందరికీ ఈ విషయాన్ని చెప్పారు.

ఈ సంగతి తెలుసుకున్న గ్రామ పెద్ద ఆ రైతును పిలిపించి "నీవు ఆ కళాకారులను జరిపిన సత్కారం మరువలేనిది . కళలంటే నీకు ఎంత అభిమానమో మాకు తెలిసింది. ఆ పులి వేషం వేసిన కళాకారులు గ్రామస్తులందరితో నీవు జరిపిన సత్కారం గురించి చెప్పారు . వారిని రమ్మని నీవు గౌరవించడమే కాకుండా వారి దాహాన్ని, ఆకలిని తీర్చి వారిని పట్టు వస్త్రాలతో సత్కరించావని మాకు తెలిసింది. నీ కళాభిరుచిని వారు కీర్తిస్తున్నారు "అని అన్నాడు.

అప్పుడు అది విన్న రైతు "అయ్యో! నేను చేసింది ఏమీ లేదు. నా స్థానంలో ఎవరున్నా అలాగే చేస్తారు. ఇందులో నా గొప్ప తనం ఏమీ లేదు. వారు ఆ కళను పోషిస్తున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఒక్క నాకే కాదు. వారు ఎంతో మంది పిల్లలకు, పెద్దలకు తమ ఆటతో ఆనందాన్ని కలిగిస్తున్నారు. వారి ఆటను నా తోటలో చూసిన నేను ఎంతో అదృష్ట వంతుడిని" అని అన్నాడు .


అప్పుడు ఆ గ్రామ పెద్ద " నీవు నీ గొప్పతనాన్ని చెప్పుకోవని మాకు కూడా తెలుసు. వారిని లోపలికి పిలిచి కూర్చుండబెట్టడం, పండ్లు ఇచ్చి , పట్టు పంచెలను కప్పి పంపించడం ఆ సత్కారంలో భాగమే! నీవు అందరికీ ఆదర్శం. అందుకే కళల పట్ల నీకున్న అభిమానానికి నిన్ను అభినందిస్తున్నాము. నీ వలెనే మేము కూడా ఆ పులి వేషం వేసిన కళా కారులను సత్కరించదలిచాము "అని చెప్పి ఆ కళాకారులను అందరి ముందు ఘనంగా సత్కరించాడు. అప్పుడే అక్కడికి వచ్చిన ప్రజలు గట్టిగా కరతాళధ్వనులు చేశారు. ఆ కళాకారులు ఎంతో సంతోషించారు. ఆ రైతును ఆదర్శంగా తీసుకొని మరికొందరు కూడా ఆ పులి వేషం వేసిన కళాకారులను ఘనంగా సత్కరించారు. అందుకే పిల్లలూ! కళలను ఆదరించాలి. కళాకారులను సత్కరించాలి.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,

ధర్మపురి, 9908554535

# పథకాలన్నింటిలో కెసిఆర్ ముద్ర

అనేక ఆశలు,ఆశయాలతో, అమరుల త్యాగాలతో పురుడుపోసుకున్న తెలంగాణను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు కెసిఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నతీరు ఇప్పుడు దేశానికి దిక్సూచి అనేలా ముందుకు సాగుతున్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా అనేక విజయాలు సాధించారు. పది జిల్లాల తెలంగాణను 31 జిల్లాలుగా విభజిస్తూ కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో పాలన ప్రజలకు చేరువైంది. జిల్లా కేంద్రాలు కూతవేటు దేరంలోకి వచ్చాయి. సుపరిపాలన దిశగా సుస్థిర పాలన అందించటం క్లిష్టమైనదే కాకుండా కష్టసాధ్యమైనది కూడా. రాష్ట్ర ఏర్పాటుకు పోరాడడం ఒక ఎత్తయితే, సుస్థిరాభివృద్ధికి సుపరిపాలన ఎంతో అవసరం. ఆ దిశగా వేస్తున్న అడుగులు సహజంగానే ఇతరులకు పెద్దగా కనిపించకపోవచ్చు. అవి అడుగులే కాదనే వారు ఉంటారు.కానీ కెసిఆర్ మాత్రం ఒక్క అడుగే వేల కిలోమీటర్ల ప్రయాణానికి పునాది అంటారు. అందుకే తాను నమ్ముకున్న బాటలో సాగడానికి ఆయన విమర్శలను పక్కన పెట్టారు. అందుకే అచిర కాలంలోనే దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాల రూపకల్పనలో తనదైన ముద్రను వేశారు. అనేక కార్యక్ర మాల్లో రైతాంగ సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలే విప్లవాత్మకంగా నిలవనున్నారు. రైతులు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా వ్యవసాయం చేసుకుని బంగారు పంటలు పండించేలా రైతులకు సకల హంగులు సమకూరుస్తున్న తీరు దేశవ్యాప్తంగా ఆకర్శితమవుతోంది. రైతులకు జీవితబీమా పథకం అన్నది ఓ గొప్ప ఆలోచన. దానిని అమలు చేస్తే రైతులకు ఇక ఆత్మహత్యల శరణ్యం రాదు. ఇప్పటికే అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తరుణంలో ఈ పథకం గొప్ప వరంగా భావించాలి. రాష్ట్రంలోని ప్రతి రైతుకు రూ.5 లక్షల జీవితబీమా పథకం నిర్వహణ ఆసరాగా మారింది. వ్యవసాయరంగం అభివృద్ధి కోసం రైతుబంధు పథకం ప్రారంభించి ఎకరానికి ఏటా పదివేలు పెట్టుబడి సాయం అందించడం తోపాటు, రైతుబీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఈ తొమ్మిదేళ్ల పాలనలో తీసుకున్న నిర్ణయాలను, అమలువుతున్న తీరును ప్రజల్లోకి గట్టిగా తీసుకుని వెళ్లేలా కార్యాచరణకు సిద్ధం అవుతున్నారు. తెలంగాణలో రైతులకు, ప్రజలకు నమ్మకం భరోసా కల్పించడం లో సీఎం కేసీఆర్ విజయం సాధించారనే చెప్పాలి. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలను ఆకర్షిస్తున్నాయని నేతలు పదేపదే అంటున్నారు. కేసీఆర్ తీసుకున్న ప్రతి పథకం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నదని, త్వరలోనే జాతీయస్థాయిలో అన్ని పార్టీలకు ఇవే మ్యానిఫెస్టోలు కానున్నాయని తెలిపారు. కరువులేని రాష్ట్రంగా మార్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. గత తొమ్మిదేళ్లలో అనేకానేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపదించిన గులాబీనేత కెసిఆర్ కూడా ఈ దశాబ్దివేళ తన అభివృద్ధి మంత్రాన్ని ప్రజలకు వివరించనున్నారు. ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం చేపట్టిన జిల్లాల పునర్విభజన, పింఛన్లు–జీవనభృతి, మైనారిటీ సంక్షేమం, మౌలికవసతుల కల్పన, రైతుబంధు, రైతుబీమా, ప్రాజెక్టుల నిర్మాణం, విద్యావైద్యంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారంలో ఉన్నవే. ఇకపోతే మంచినీటికోసం మిషన్ భగీరథ, సాగునీటి కోసం మిషన్ కాకతీయ, 24 గంటల విద్యుత్ సౌకర్యం వంటివి విజయవంతంగా అమలు జరుగుతున్నాయి. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, వికలాంగులు ఇలా అందరికీ పింఛన్ అందిస్తున్న తీరు కూడా ఆసారగా నిలిచింది. గతంలో నిరంతర కోతలు తప్ప విద్యుత్ ఉండేది కాదు. ఇప్పుడు ఎక్కడా కోతలు అన్న పదానికి తావు లేకుండా చేసిన ఘనత సిఎం కెసిఆర్‌దే. ఇది ఎవరూ కాదనలేని నిజం. మనకు అనుభవంలో ఉన్న సత్యం. పారిశ్రామిక వేత్తలు కూడా దీనిని అంగీకరిస్తున్నారు. ఇక మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాల అధ్యయనం కోసం ఇక్కడికి వివిధ రాష్ట్రాల అధికారులు వస్తున్నారంటే అవి ఎంతగా ప్రాచుర్యం పొందాయో చెప్పకరలేదు.




# అమ్మా తెలంగాణమా....!!
# ఆకలి కేకల గానమా...??

తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం కడు పేదరికంలో అలమటిస్తున్నదా? ఇక్కడి ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారా? అంటే ప్రస్తుత పరిస్తితులను చూస్తే అవుననే అనిపిస్తున్నది. రాష్ట్రంలో 85 శాతం 30 మిలియన్ల మంది హిందువులు, 12.6 శాతం 4.4 మిలియన్ల ముస్లింలు, 1.3శాతం 4.47 లక్షల క్రిస్టియన్లు, 0.04శాతం 30.34 లక్షల సిక్కులు, 0.075 శాతం 26.6లక్షల జైనులు, 1శాతం ఇంచుమించుగా బౌద్ధులు వున్నారు.

రాష్ట్ర జనాభా యూనిక్ ఐడెంటిఫికేషన్ ఆధార్ ప్రకారం 2019 చివరి నాటికి 3,89,19,054 ఉన్నట్లు రికార్డులు చెపుతున్నాయి. గత శాసన సభ సాధారణ ఎన్నికల నాటికి 2.71 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 41.78 లక్షల మందికి ఆసరా పెన్షన్లు, 58.33లక్షల మందికి రైతు బంధు,/రైతు బీమా, 77 లక్షల మందికి ఆరోగ్యశ్రీ, 30 లక్షల మందికి కంటి వెలుగు, 80లక్షల రేషన్ కార్డులు, 13 లక్షల విద్యార్థులకు ఉపకార వేతనాలు/ఫీ రీఇంబర్స్ మెంట్, 4లక్షల మందికి కళ్యాణ లక్ష్మి/ షాదీ ముబారక్, 8.5 లక్షల మందికి కేసిఆర్ కిట్లు, 7,20,416



కుటుంబాలకు గొర్రెల యూనిట్లు, 4 లక్షల మంది బీడీ కార్మికులకు, 1.26మంది ఒంటరి మహిళలకు, 2.17 పాడి రైతులకు, 2.65 లక్షల మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు, 42 వేల బోదె కాలు బాధితులు, 10,980 మంది పోలీసుల నియామకాలు, హోమ్ గార్డుల జీతాలు పెంపు, ధూప దీప నివేదకులు/మౌజన్/ఇమాంల భృతి పెంపు, ఆశా, అంగన్వాడీలు, బతుకమ్మ చీరలు, పేద ముస్లిం, క్రిస్టియన్లకు దుస్తుల పంపిణీ, కుల సంఘాల లబ్ధి దారులకు ప్రయోజనాలు, వ్యక్తిగత సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ ఓ సీలు, ఇలా చాలా మంది ప్రాయోజితులు అయినారు. ఈ గణాంకాలు అన్నీ గత శాసన సభ ఎన్నికల నాటివి..కేసిఆర్ నేతృత్వంలోని తెరాస పార్టీ 2వ సారి అధికారం చేపట్టాక చాలా అంశాలలో చాలా మంది లబ్ధి పొందారన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. డబ్బు రూపేణ కాకుండా ఇతర అవసరాలకు సైతం ప్రయోజనాలు పొందారనేది అందరూ అంగీకరించే సత్యం. ప్రజాకర్షక పథకాలు ఓటు బ్యాంకును పెంచినా, వాటి ఫలితంగా ఏర్పడుతున్న ఆర్థిక భారాన్ని ప్రభుత్వం మోయక తప్పదు.

ఇది ఇలా ఉంటే...రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను సంక్షేమ రంగానికే ఖర్చు చేస్తుండగా, ఆ నిధుల ఖర్చుల వల్ల ప్రజల ఆర్థిక స్థితిగతులు బాగు పడక పోగా, మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థ "లోటు బడ్జెట్ " లోకి వచ్చిందనే విషయం వాస్తవం. మిగులు బడ్జెట్ లోటు బడ్జెట్ గా మారడంతోపాటు, ప్రభుత్వం చేసిన అప్పులు కూడా గణనీయంగా పెరిగాయి.

"తెలంగాణ రాష్ట్రం సాకారమైతే ఇక్కడి ప్రజల జీవితాలలో వెలుగులు నిండుతాయని ఉద్యమ పార్టీకి తెలంగాణ ప్రజలు ఏకపక్షంగా అధికారం రెండవ సారీ అప్పనంగా అప్పగించినా... తెలంగాణ సంబంధిత సహజ వనరులు, ఆదాయ మార్గాలు, మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్ర ఖజానా నేడు లోటుతో కొట్టు మిట్టాడుతున్నది.

ప్రతి నెల తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వము చెల్లిస్తున్న సొమ్ములో రెండు వేల కోట్ల రూపాయలు అప్పులపై వడ్డీ చెల్లింపులకే పోతున్నది. 12 వందల కోట్ల రూపాయలు ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు పోగా, ఆసరా పెన్షన్ లకు 420 కోట్లు, కల్యాణ లక్ష్మి , కెసిఆర్ కిట్ లకు 200 కోట్లు ఖర్చు అవుతున్నది. సబ్సిడీ బియ్యం 168 కోట్ల రూపాయలను కలుపుకుంటే మొత్తం ప్రభుత్వ నెలసరి ఖర్చు నాలుగు వేల కోట్ల పైనే.

ప్రజలు కోరుకున్న వాటి కంటే కూడా కోరని వాటిని నెర వేర్చడం, ఉద్యోగులు అడిగిన దానికంటే కూడా ఎక్కువ ఇస్తుండడం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిర్ణయాలు.

నానాటికీ పలు శాఖల్లో ప్రభుత్వం చెల్లించవలసిన పెండింగ్ బిల్లులు పేరుకుపోతున్నాయి. ఉద్యోగుల నెలవారీ వేతనాల చెల్లింపుకు సైతం ఆర్థిక ఇబ్బందులు అవరోధంగా నిలుస్తున్నాయి.

****

### కేసిఆర్ పాలనకు మరో పార్శ్వం - జూన్ 2


తెలంగాణ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా 2014 జూన్ 2వ తేదీన ప్రమాణ స్వీకారం చేశారు. రెండవసారి 2018 డిసెంబర్ 23 న ఆయన సీఎం గా ప్రమాణ స్వీకారం గావించారు. ఆ నేపథ్యాన్ని ఒక్కసారి మననం చేసుకుందాం.

నిజాం నిరంకుశ పాలన నుండి 1948లో హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనమైనా, 1953లో మద్రాసు నుండి ఆంధ్రరాష్ట్రం విడివడినా, ఉమ్మడి రాష్ట్రంలోని సమస్త వనరులు తరలించ బడతాయన్న తెలంగాణ ప్రాంతీయుల అభిప్రాయాలను కాలరాచిన ఫలితంగా, 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటి నుండి స్వార్థ రాజకీయ పాలకుల కారణంగా తెలంగాణకు అడుగడుగునా అన్ని రంగాలలో తీరని అన్యాయమే జరిగింది. ఫలితంగా 1852లో నాన్ ముల్కీ గోబ్యాక్, 1969లో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచాయి. రాష్ట్రపతి ఉత్తర్వులు, పెద్ద మనుషుల ఒప్పందాలు, ఆంధ్ర ప్రాంతీయులను ఉద్యోగాలలో వెనక్కు పంపే జీఓ 38, తెలంగాణ ఎన్జీవో పోరాట ఫలితమైన జీవో 610 అమలు కానే లేదు. ఫలితంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే అన్నింటికీ పరిష్కార మార్గమని ప్రత్యామ్నాయం లేదని భావిస్తున్న తరుణంలో, కేసిఆర్ నేతృత్వంలో తెరాస ఉద్యమ పార్టీగా ఆవిర్భవించింది. బాలారిష్టాలు, ఆటుపోట్లకు వెరవక, ఎన్ని అడ్డంకులెదురైనా కేసీఆర్ మాటల్లో "గమ్యాన్ని ముద్దాడే వరకు విశ్రమించని ఉద్యమాన్ని" కేసిఆర్ భుజ స్కంధాలపై మోసారు. సకల జనుల సమ్మె వరకు అనేకానేక ఘట్టాలకు తెర లేపారు. మరణ శాసనం రాసుకునే వరకు వెళ్ళి, జీవితాన్ని ఫణంగా పెట్టి ఆమరణ దీక్షకు పూనుకుని, ఢిల్లీ పెద్దలను కదిలించి, వారిపై ఒత్తిడిని పెంచారు. చివరకు రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్ష నెరవేర్చుటకు కారణ భూతులైనారు. కేసీఆర్ భాష, యాస, వివిధ అంశాలపై ఆయనకు గల సాధికారతలు ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టేలా చేశాయి. ఉద్యమ కాలంలో విశ్రాంత సమయాలను సద్వినియోగ పరుచుకుని, వివిధ రంగాలలో నిష్ణాతులతో కేసీఆర్ అపారమైన అవగాహన పొందారు. వీటిని జోడించి బంగారు తెలంగాణ బాటలో ప్రభుత్వాన్ని నడిపేందుకు కంకణధారియైనారు. ఆమరణ దీక్షా సమయంలో వివిధ సందర్భాలలో రాజీనామాలు చేయించి, ఉప ఎన్నికలను ఆహ్వానించడంలో, ఎందరు అభిప్రాయ బేధాలతో పార్టీని వీడినా వెరవక, ముందుకు సాగిన కేసిఆర్ మొండి వైఖరి, ఏదైనా సాధించగలరనే ప్రబల విశ్వాసం ప్రజలలో కలిగించింది. అందుకే నీళ్ళు, నిధులు, నియామకాలతో సహా కేసీఆర్ నేతృత్వంలో అన్నీ సాధ్యమనే భావన తెలంగాణ వాసుల్లో కలిగింది. అన్ని సమస్యల నుంచి విముక్తి ప్రదాతగా కేసీఆర్ ను ప్రజలు భావించి ఎన్నికలలో

తిరుగులేని మద్దతు పలికారు. ఎవరి సాయం అక్కర లేకుండానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంతగా ప్రజలు ఆయనకు మద్దతిచ్చారు. అధికారం "హస్తానికి గతమై తెరాసకు హస్తగతమయ్యాక", ప్రభుత్వాధినేతగా దీర్ఘకాలిక, స్వల్పకాలిక, సామాజిక, వైయక్తిక ప్రాయోజిత కార్యక్రమాలకు అంకుర్పణ చేశారు. తెలంగాణ సెంటిమెంట్ పూర్తి స్థాయిలో అనుకూలించదని తెలిసి, రెండవసారి ఎన్నికల్లో అభివృద్ధి మంత్రం ప్రధానంగా పఠించి, ఆశించిన దానికన్నా, అధిక స్థానాలను కైవసం చేసుకుని, తనకు, తన పార్టీకి రాష్ట్రంలో తిరుగు లేదని నిరూపించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలూ చేపట్టారు.

నాణానికి బొమ్మా, బొరుసూ ఉన్నట్లే పాలనకు మరోకోణం కూడా చూడాల్సి ఉంది. ఉద్యమ పార్టీ రాజకీయ పార్టీగా రూపాంతరం చెందగా, అన్ని పార్టీల బాటలోనే తాత్కాలిక అవసరాలు, ప్రయోజనాల కోసం ఉద్యమానికి సంబంధం లేని వారిని పార్టీలో చేర్చుకోవడాలు, అధికారాలు కట్టబెట్టడాలు, తెరాస ఆవిర్భావం నుండి అంకిత భావంతో పనిచేసిన, జెండాలు మోసిన వారికి మింగుడు పడని అంశంగా మారింది. సమర్థత కొలమానం కాకపోగా, కొన్ని నిర్ణయాలు అపాత్రదానాలైనాయి. నీళ్ళు, నిధులు మాట ఎలా ఉన్నా నియామకాల విషయంలో ఆశావహులు చకోరపక్షుల్లా ఎదిరి చూస్తునే ఉన్నారు. ఉద్యమ కారులపై కేసులు ఇంకా ఎత్తి వేయబడనే లేదు. ఉద్యమకాల ఆసాంతం రోడుపైకి వచ్చి, పోరాటాలు సాగించిన ప్రైవేటు విద్యాసంస్థలు గడ్డు కాలాన్ని అనుభవిస్తున్నాయి. కేంద్రంతో సమానంగా రాష్ట్ర ఉద్యోగుల వేతనాలు, ఉద్యోగుల పట్ల ఉదాసీన వైఖరి, స్థానిక సంస్థలకు అధికారాల బదలాయింపు, రాజకీయ జోక్యం లేని ధార్మిక పరిషత్ ఏర్పాటు, సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాలు, పేదలకు ఇళ్ళు, భూపంపిణీలు, కేజీ టు పీజీ ఉచిత విద్య తదితర ఇంకా కొన్ని అంశాలు పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. సెంటిమెంట్ కను మరుగై వేళ.. అభివృద్ధియే కొలమానంగా ఇటీవల ఎన్నికలకు వెళ్ళి, తిరుగే లేని ఘన విజయం సాధించిన క్రమంలో, కేసీఆర్ పాలన పట్ల ప్రజలకు విశ్వాసం ఇంకా సడల లేదని స్పష్టం అవుతున్నది.

అనుభవైకవేద్యుడైన తెరాస అధినేత, ఉమ్మడి పాలనకు ఇప్పటికి తేడా లేదనే కొందరి భావనలను తప్పు అని రుజువు చేసేందుకు, రానున్న రోజులలో పలు వర్గాల ప్రజల అసంతృప్తులను, అసహనాలను, అసమ్మతులను దూరం చేసేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టనున్నారో? ఎలా ప్రజల మద్దతును చేజారి పోకుండా చర్యలు చేపట్ట నున్నారో? లాంటి ప్రశ్నలకు సమీప భవిష్యత్తే సమాధానం చెప్పనుంది.



-ఆర్కె సంగనభట్ల
9440595494



## 9 నుంచి రెండో విడతల గొర్రెల పంపిణీ

### మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్,జూన్1 (ప్రజా మంటలు):** ఈ నెల 9 నుంచి రెండో విడతల గొర్రెల పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మొదట 5వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించామని, అనివార్య కారణాలతో 9వ తేదీకి మార్చినట్లు తెలిపారు. రెండో విడత గొర్రెల పంపిణీపై మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రెండో విడత గొర్రెల పంపిణీని ప్రారంభాలని నిర్ణయించినట్లు చెప్పారు. లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చే గొర్రెలకు అవసరమైన మందులు, దాణా, ఇన్సూరెన్స్ ట్యాగ్‌లు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 8, 9, 10 తేదీల్లో మూడు రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలో నిర్వహించే ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ 8న ప్రారంభించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఫెస్టివల్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించే ప్రాంతాల్లో విజయ డెయిరీ ఉత్పత్తుల విక్రయ స్టాల్స్‌ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## నిషేధిత మావోయిస్ట్ కొరియర్ల అరెస్ట్

### పేలుడు సామాగ్రి స్వాధీనం చేసుకున్న పోలీసులు

**ములుగు,జూన్1 (ప్రజా మంటలు):** నిషేధిత మావోయిస్టులకు సహాయ, సహకారాలు అందిస్తున్న ముగ్గురు కొరియర్లను ములుగు జిల్లా పోలీసులు అరెస్టు చేసి వారివద్ద నుంచి పేలుడు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత సీపీఐ మావోయిస్టులకుచెందిన అగ్రనాయకులు, దళ సభ్యులు వాజేడు గ్రామంలో రోడ్డు వర్క్ మిషన్లను తగల బెట్టేందుకు వ్యూహం వేశారని పోలీసులకు పక్కా సమాచారం అందింది. వాహనాలను తగలబెడితే అటుగా వచ్చే పోలీసులను ల్యాండ్‌మైన్‌తో చంపివేయడానికి కుట్ర పన్నుతున్నట్లు సమాచారం అందిందని వెంకటపరం సీఐ శివప్రసాద్ తెలిపారు. దీంతో పోలీసు బలగాలతో ఆదివారం రాత్రి వాజేడు నుంచి గుమ్మడిదొడ్డి మార్గంలో ఫుట్ పెట్రోలింగ్ చేస్తుండగా గ్రామ శివారులో ముగ్గురు అనుమానిత వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయే యత్నం చేశారని వివరించారు. వీరిని పోలీసులు పట్టుకుని విచారించగా వారి వద్ద పేలుడు పదార్థాలు లభించాయని పేర్కొన్నారు. వాజేడు మండలం ప్రగళ్లపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి నాగరాజు, ఏటూర్ నాగారానికి చెందిన వావిలాల నర్సింగరావు, అదే గ్రామానికి చెందిన ఏంపెల్లి జాషువా అనే ముగ్గురు కొరియర్లను అరెస్టు చేశామని వివరించారు. కొరియర్ల వద్ద నుంచి డిటోనేటర్లను, సెల్‌ఫోన్లను, విద్యుత్ తీగలు,బ్యాటరీలను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వాహనాలను తగుల బెట్టడానికి పెట్రోల్‌తో పాటు నగదును ఇచ్చిన గుమ్మడిదొడ్డిలోని పెట్రోల్ బంక్ ఓనర్ కంబాలపల్లి గణపతిని కూడా అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

## వరుసగా రెండో రోజూ నష్టాల్లో మార్కెట్లు

### సెన్సెక్ 193 పాయింట్లకుపైగా పతనం

**ముంబై,జూన్1 (ప్రజా మంటలు):** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్ 193 పాయింట్లకుపైగా పతనం కాగా.. నిఫ్టీ 18,500 పాయింట్ల దిగువన ముగిసింది. బుధవారం నష్టాల్లో ముగిసిన మార్కెట్లు.. గురువారం ఉదయం ఎలాట్‌గా మొదలయ్యాయి. సెన్సెక్స్ 62,736 పాయింట్ల వద్ద ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో 62,762 నుంచి 62,359 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. చివరకు 193.70 పాయింట్ల నష్టంతో 62,428.54 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 18,579 పాయింట్ల వద్ద మొదలవగా.. ఇంట్రాడేలో 18,580 నుంచి 18,464 మధ్య కొనసాగింది. ట్రేడింగ్ ముగిసే సరికి 46.60 పాయింట్లు క్షీణించి 18,487.80 పాయింట్ల వద్ద ముగిసింది. ÷-రేడింగ్‌లో 2034 షేర్లు పురోగమించగా.. 1408 షేర్లు పతనమయ్యాయి. మరో 120 షేర్లలో ఎలాంటి మార్పులు కనిపించలేదు. నిఫ్టీలో కోల్ ఇండియా, కొటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్యూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్స్ టాప్ లూజర్ అత్యధికంగా నష్టపోయాయి. అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్, దివీస్ లేబొరేటరీస్, బజాజ్ ఆటో, టాటా మోటార్స్, ఏషియన్ పేయింట్స్ లాభపడ్డాయి. రంగాల వారీగా బ్యాంక్, మెటల్ సూచీలు ఒక్కొక్కటి 0.5శాతం క్షీణించగా.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రియల్టీ, ఫార్మా రంగాల స్టాక్స్ 0.5శాతం నుంచి ఒకశాతం వరకు లాభపడ్డాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఎలాట్‌గా ముగియగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.6శాతం పెరిగింది.

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

### 8, 9, 10 తేదీల్లో ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్

### ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సమీక్ష

**హైదరాబాద్,జూన్1 (ప్రజా మంటలు):** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించనున్న సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. సచివాలయంలో గురువారం దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమాలు, లబ్దిదారులకు జరిగిన మేలుపై కరపత్రాల ద్వారా వివరించాలని సూచించారు. రాష్ట్రంలో సబ్సిడీ గొర్రెల యూనిట్లు పొందిన గొర్రెల పెంపకందారులు, ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన వాహనాలు, ఉచిత చేప పిల్లల ద్వారా లబ్దిదారులు అత్యధికంగా ఉన్నారని, ఉత్సవాల్లో పశుసంవర్ధక, మత్స్య శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని చెప్పారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి కార్యక్రమాలపై సమగ్ర కార్యాచరణను రూపొందించి జిల్లా, మండల అధికారులకు పంపించి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ఆదేశాలు జారీ



చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఉత్సవాలలో భాగంగా జూన్ 3న తెలంగాణ రైతు దినోత్సవం సందర్భంగా గ్రామాల్లోని రైతు వేదికల వద్ద నిర్వహించే కార్యక్రమాల్లో పాడి రైతులు, మత్స్యకారులు పాల్గొనే విధంగా డెయిరీ అధికారులు, మత్స్య శాఖ అధికారులు, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. 8న చెరువుల పండుగ సందర్భంగా ప్రధాన చెరువులు, రిజర్వాయర్ల వద్ద వేదికలను ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాల ను నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ ఇతర పథకాలపై ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న పరిస్థితులు, తెలంగాణ వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు, ఫొటో ప్రదర్శనలు నిర్వహించాలని చెప్పారు. కార్యాలయాలకు విద్యుత్ దీపాలంకరణ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా అన్ని పశువైద్యశాలల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.గోపాలమిత్రలు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొనేలా చూడాలని అన్నారు. ఇవే కాకుండా 21 రోజులపాటు ప్రతిరోజూ వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో కూడా భాగస్వాములు కావాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## నేటికీ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించకపోవడం

# ఉద్యమకారుల దౌర్భాగ్యమే

- ముల్కనూర్‌లో దశాబ్ద కాలంగా ఆవిష్కరణకు నోచుకోని అమరవీరుల స్తూపం
- ఏ త్రిశంకు స్వర్గంలో అమరవీరుల స్తూపం
- ఏ దశాబ్ది వేడుకలలోనైనా ఆవిష్కరణకు నోచుకునేనా?
- ఏ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజామంటలు ప్రత్యేక కథనం



**భీమదేవరపల్లి ప్రతినిధి, జూన్ 02 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకొని పదవ సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవ డానికి జూన్ 2 నుండి 22వ తారీకు వరకు రోజువారి కార్యాచరణ ప్రకటించడం జరిగింది. 21 రోజుల కార్యాచరణ ఉత్సవాలలో ఒక్కరోజు కూడా తెలంగాణ ఉద్యమకారుల గురించి ప్రస్తావించకపోవడం వారి దౌర్భాగ్యమే అవుతుందని టీవీవి రాష్ట్ర కార్యదర్శి డ్యాగల సారయ్య అన్నారు.

### ఉద్యమకారుడే పాలకుడైన కానీ....

రాష్ట్ర అవతరణ నుండి నేటి వరకు ముఖ్యమంత్రి ఒక ఉద్యమకారుడే.. పాలకుడిగా ఉండి రాష్ట్ర ఏర్పాటుకు ప్రధాన భూమిక పోషించిన తెలంగాణ ఉద్యమకారులను మాత్రం గుర్తించకపోవడం దురదృష్టకరమే.

### సీమాంధ్ర పాలకుల నిరంకుశ వైఖరి

60 సంవత్సరాల తెలంగాణ ఉద్యమాన్ని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తీరును లోతుగా అధ్యయనం చేస్తే ప్రధానంగా మూడు అంశాలు దోహదపడతాయి. 1. తెలంగాణ అమరుల అమరత్వం, 2 తెలంగాణ ఉద్యమకారుల శ్రమ 3. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ ఈ మూడు అంశాలను నిశితంగా పరిశీలిస్తే తెలంగాణ ఉద్యమం మొక్క దశలోనే కూకటివేళ్లతో పెకలించాలని, లేదంటే ఉద్యమం వటవృక్షంగా మారితే దాన్ని ఆపడం ఎవరి తరం కాదని భావించిన వలసాంధ్ర పాలకులు భవిష్యత్తులో ఎవరు తెలంగాణ ఉద్యమం చేయకుండా జై తెలంగాణ నినాదం అనకుండా ఉండాలంటే ఉద్యమకారులను చంపడమే ఏకైక మార్గమని భావించి 1969లో కాసు బ్రహ్మానందరెడ్డి 369 మందిని కిరాతకంగా పిట్టలను కాల్చినట్లు కాల్చి చంపితే చావంటే మాకు భయం లేదురా రాష్ట్రం కోసం ఎంత మందిమైన చావడానికి అయినా మేము సిద్ధం రా ! అని 1200 మంది తమ ప్రాణాలను త్యాగం చేసి రాష్ట్ర ఏర్పాటులో మొదటి మెట్టుగా నిలిచారు.

### సృష్టి ఉన్నంతకాలం అమరుల త్యాగం చిరస్మరణీయం

ప్రతి అమరుని అమరత్వం వెనుక ప్రత్యేకమైన నేపథ్యం ఇమిడి ఉంటుంది. ఉదాహరణకు ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమరణ దీక్షతో నిప్పు కనికల్లాగా ఉవ్వెత్తున లేచిన ఉద్యమం దీక్ష విరమిస్తున్నట్లు వచ్చిన వార్తతో ఉద్యమం ఎక్కడ ఆగిపోతుందో అనే ఆందోళన, ఎలాగైనా ఉద్యమం ఆగవద్దని నేను చావాలి, నా చావుతో ఆకాశమంత ఎత్తుతో ఉద్యమ సెగలు లేవాలని శ్రీకాంతచారి ఆత్మార్పణం అగ్నికి ఆహుతి అయినాడు.

### ఒట్టు పెట్టి మరీ బద్దిపోచమ్మకు బలి అయిన ఈశాంత్ రెడ్డి

తెలంగాణ వాదం లేదని వలస పాలకుల చౌకబారు ఆరోపణలు కేంద్ర పెద్దలకు తప్పుడు నివేదికలు, డబ్బు మూటలతో కేంద్ర ప్రతినిధులను లొంగదీసుకోవడం తెలంగాణ వాదం ఉందని నిరూపించడానికి వచ్చిన ఉప ఎన్నికలు, ఆ ఎన్నికలు తెలంగాణ వాదులకు ఒక ఛాలెంజ్ గా నిలిచాయి. ఎలాగైనా తెలంగాణ వాదాన్ని రూపుమాపాలని వలస పాలకుల కుట్ర. ఎన్నికలలో తెలంగాణ వాదం గెలిస్తే నా ప్రాణం నీకు అర్పిస్తా తల్లి అని ఒట్టు పెట్టి బద్ది పోచమ్మ తల్లికి మొక్కుకున్నాడు. ఎన్నికల్లో అఖండ మెజారిటీతో తెలంగాణ వాదం విజయం సాధించింది. ఇచ్చిన మొక్కుకు కట్టుబడి గుడిలోనే శూలంతో పొడుచుకొని ఈశాంత్ రెడ్డి రాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మార్పణ చేసుకుని వీరమరణం పొందినాడు.

### నాచావే చివరి చావు కావాలని ప్రాణాలు అర్పించిన యాదవ రెడ్డి

తెలంగాణ పల్లెల్లో ఉరుములై ఉరకలేస్తున్న తెలంగాణ ఉద్యమం రోజురోజుకు పెరుగుతున్న బలిదానాలు ఎట్లయినా సోనియాగాంధీ కళ్ళు తెరిపించాలి. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాలి నా చావే చివరి చావు కావాలి అని పార్లమెంటు భవనం ముందున్న చెట్టుకు ఉరివేసుకొని ప్రాణ త్యాగం చేసిన యాదవ రెడ్డి మరణం వెలకట్టలేనిది ఇలా ప్రతి అమరుని ప్రాణత్యాగానికి ఒక చరిత్ర ఉంది.

### తెలంగాణ ఉద్యమకారుల పాత్ర

అమరులు అందించిన ఉద్యమ కాగడాలను చేతబట్టుకుని, అమరుల స్ఫూర్తిని నరనరాన జీర్ణింప చేసుకొని, పల్లె, పట్నం, ఊరు, వాడ, ప్రతి గడపగడప తిరుగుతూ తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకొని, లాఠీ దెబ్బలు ఓర్చుకొని, జైలు జీవితాలను చవిచూచి, అనేక ఆటంకాలను అధిగమించి, రాష్ట్ర ఏర్పాటులో రెండవ మెట్టుగా కీలక పాత్ర పోషించిన వారే తెలంగాణ ఉద్యమకారులు.

### నాటి జేఏసీ మాట - ఉద్యమకారుల బాట

రాష్ట్ర జేఏసీ ఉద్యమ పార్టీ టిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఉద్యమ పిలుపును తూచా తప్పకుండా అమలు పరచడం జరిగింది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ప్రతి బహిరంగ సభను విజయవంతం చేయడానికి లక్షలాది జనాలను తరలించడానికి కృషి చేయడం జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, మహిళా, కార్మిక, కర్షక, వృత్తిపర కుల సంఘాలతో వేలాది జేఏసీలను ఏర్పాటు చేసి విలయంమార్చ్, సాగరహారం, సమర దీక్ష, సడక్ బంద్, రైల్ రోకో లాంటి ఉద్యమ కార్యాచరణను రక్తం చిందిస్తూ ముల్లకంచెలను దాటి, భాష్పవాయువు గోళాలను భరిస్తూ, జలపిరంగులను దాటుతూ, గమ్యాన్ని ముద్దాడిన వీర సైనికులు తెలంగాణ ఉద్యమకారులే..

### నేటి పాలకుడే ఉద్యమకారులను గుర్తించకపోవడం మాయని మచ్చ

ఏ యుద్ధ చరిత్ర చూసిన గెలుపోటములు సైన్యం యొక్క యుద్ధ తంత్రం మీదనే ఆధారపడి ఉంటుంది సైన్యం లేని సైన్యాధిపతి ఎంతటి బలవంతుడైన శత్రువు చేతిలో పరాజయుడు కావాల్సిందే. "యుద్ధంలో అఖండ విజయాన్ని సాధించిన సైన్యాధిపతి సైన్యాన్ని మర్చిపోవడం రాజనీతిజ్ఞతకే మాయని మచ్చ".

### ఆర్టికల్ 3 ముందు చూపు

బలవంతులు బలహీనులను అణిచివేసే ప్రమాదం ఉందని ముందు చూపుతో ఆర్టికల్ 3 పొందుపరచడం వల్ల పాలకులు ఎన్ని కుయుక్తులు చేసిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఇవ్వవలసిన పరిస్థితిని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ముందు చూపుతోనే ఏర్పడినది.

### తెలంగాణ జాతిపిత ఆచార్య జయశంకర్

పరిశోధన, ఉద్యమం వల్ల ప్రజల భాగస్వామ్యం లేని ఉద్యమాలు విఫలమైనట్లు ప్రజల భాగస్వామ్యం ఉన్న ఉద్యమాలు సఫలమైనట్టు ప్రపంచ ఉద్యమాలను అధ్యయనం చేయడం వల్ల తెలుసుకొని ఆచార్య జయ శంకర్ బోధించు - సమీకరించు - పోరాడు అనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సూత్రాలకు అనుగుణంగా భావాజల వ్యక్తి ఉద్యమ నిర్మాణం, రాజకీయ ప్రక్రియ అనే సూత్రాలతో తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం వలన "ప్రజాశక్తిని మించిన శక్తి ఈ సృష్టిలో మరొకటి లేదని" తెలంగాణ ప్రజలు పార్లమెంటు మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించుకోవడంతో పాలకులకు ప్రభుత్వాలకు రుజువు చేయడం జరిగింది.





### ప్రతి బలిదానం వెనక స్వరాష్ట్ర ఆకాంక్ష

ఉద్యమ సెగలు ఆరిపోకుండా శ్రీకాంతాచారి తెలంగాణ వాదం ఓడిపోకుండా ఈశాంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం మరియు సోనియాగాంధీ కండ్లు తెరిపించడం కోసం ప్రాణ త్యాగాలు చేసినారు. ఇలా ప్రతి అమరుని బలిదానం వెనుక రాష్ట్ర ఏర్పాటు బలమైన ఆకాంక్ష ఇమిడి ఉంది.

### ఇకనైనా ఉద్యమకారులను గుర్తించండి

ఇకనైనా తెలంగాణ ప్రభుత్వం నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి స్వాతంత్ర సమరయోధులకిచ్చే విధంగా పెన్షన్ మంజూరీ చేయాలని విజ్ఞప్తి. అదే విధంగా రాష్ట్రంలోని అమరవీరుల స్తూపాలను అధికారికంగా ఆవిష్కరించాలని ఉద్యమ వందనాలతో కోరుకుంటున్నాం.



- డ్యాగల సారయ్య.టీవీవి రాష్ట్ర కార్యదర్శి
- కాశిరెడ్డి ఆదిరెడ్డి
ప్రజామంటలు ప్రతినిధి, జర్నలిస్ట్ భీమదేవరపల్లి, హనుమకొండ జిల్లా.

## బొజ్జ ఉన్న వారికి నో ప్రమోషన్లు

### హోం మంత్రి సమక్షంలో మంత్రి మల్లారెడ్డి వ్యాఖ్య

**మేడ్చెల్,జూన్1 (ప్రజా మంటలు):** మంత్రి మల్లారెడ్డికి నోటి దురుసు కాస్త ఎక్కువే. అందుకే అప్పుడప్పుడు నోరు జారుతుంటారు. సందర్భం కాకున్నా ఏదో ఇష్యూ మాట్లాడి.. కాంట్రవర్సీ




చేస్తుంటారు. ఓ కార్యక్రమంలో హోం మంత్రి మహమూద్ అలీ , డీజీపీ అంజనీకుమార్‌లతో పాటు మంత్రి మల్లారెడ్డి ఆశీనుల య్యారు. అక్కడ వివాదాస్పద వ్యాఖ్యలు మేడ్చల్ నియోజకవర్గం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ లో మల్కాజ్గిరి జోన్ రాచకొండ కమిషనరేట్ పరిధిలో నూతన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొన్నారు. హోమ్ శాఖ మంత్రి మహముద్ అలీ, డీజీపీ సహా ఇతర ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్నారు. బొజ్జ ఉన్న పోలీసులకు ప్రమోషన్లు ఇవ్వొద్దని తెలంగాణ హోం మంత్రి మొహమూద్ అలీ, డీజీపీ అంజనీ కుమార్ లను మంత్రి మల్లారెడ్డి కోరారు. పోలీసులు



ఫిట్ నెస్ పెంచుకోవడానికి పోలీస్ స్టేషన్‌లలోనే జిమ్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. తెలంగాణ పోలీస్ డిపార్ట్ మెంట్ ప్రస్తుతం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని, మన పోలీసులు బాగా పని చేస్తున్నారని అన్నారు. కేసులను తొందరగా పరిష్కరిస్తున్నారని మల్లారెడ్డి ప్రశంసించారు. తాము ఉన్నట్లుగా పోలీసులు కూడా మంచి ఫిట్ గా ఉండాలని చెప్పారు. పోలీసులను చూస్తే దొంగలు గజగజ వణికిపోవాలని అన్నారు.
కార్యక్రమం గురించి వదిలేసి పోలీసుల గురించి మాట్లాడారు. పోలీసులకు పొట్ట ఉంటుందని, అలా అయితే కష్టం అన్నారు. పోలీసులు ఫిట్‌గా ఉండాలని.. వారిని చూస్తేనే దొంగలు భయపడిపోవాలని అన్నారు. బొజ్జ ఉన్న పోలీసులకు ప్రమోషన్లు ఇవ్వొద్దని అన్నారు. అంతేకాదు ఖాకీలు ఫిట్ నెస్ పెంచుకోవడానికి పోలీస్ స్టేషన్లలో జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ దశబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 12వ తేదీన తెలంగాణ రన్ 1లక్ష మంది తో నిర్వహించి తెలంగాణ లో రికార్డ్ సాధిస్తామని అని మంత్రి మల్లారెడ్డి, రాచకొండ సీపీ డిఎస్ చౌహన్ కి ఛాలెజ్ చేశారు. ÷లంగాణ పోలీసులు దేశంలో నంబర్ వన్ స్థానంలో ఉన్నారని మంత్రి మల్లారెడ్డి గుర్తుచేశారు. మన పోలీసులు చక్కగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కేసుల పరిష్కారం త్వరగా జరుగుతోందని తెలిపారు. సో.. పోలీసులు మంచి ఫిట్‌గా ఉండాలని కోరారు. అందుకే పొట్ట తగ్గించుకోవాలని.. తనలాగా ఫిట్‌గా ఉంటేనే ప్రమోషన్లు ఇవ్వండంటూ కామెంట్స్ చేశారు. మంత్రి మల్లారెడ్డి ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే మంత్రి మాటలకు హోం మంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీ కుమార్ నవ్వుకున్నారు. మంత్రి మల్లారెడ్డి చేసిన కామెంట్స్ చర్చకు దారితీశాయి. పోలీసుల గురించి ఇలా మాట్లాడటంపై కొందరి నుంచి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు, నేతల భద్రత కోసం పనిచేస్తాం అని.. నిరంతరం డ్యూటీలో ఉంటామని చెబుతున్నారు. తమను ఇలా అనడం బాధించిందని కొందరు పోలీసుల నుంచి అభిప్రాయం వ్యక్తం అవుతుంది.ఏదేమైనా మల్లన్న నోట వచ్చే మాటలకు ఎవరైనా అవాక్కువాల్సిందే.

# పిస్టల్‌తో బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- ఒక ఆటో పిస్టల్, 2 మాగ్జిన్ లు, 3 బుల్లెట్లు (కే.ఎఫ్ 7.65 లైవ్ రౌండ్స్),
- ఒక సెల్ ఫోన్ స్వాధీనం
- ప్రజల భద్రతకు భంగం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు.
- జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్

**కోరుట్ల టౌన్ మే 01 (ప్రజామంటలు):** అక్రమంగా పిస్టల్ (ఆటో పిస్టల్ మేడ్ ఇన్ యూఎస్ఏ) మరియు మందుగుండు సామగ్రి కలిగి ఉన్న ఐలాపూర్ గ్రామానికి చెందిన సందరగిరి లక్ష్మి నర్సయ్య తండ్రి లచ్చయ్య అను వ్యక్తి అరెస్ట్. 31-05-2023 సాయంత్రం 6:30 గంటల సమయములో అక్రమంగా పిస్టల్ మరియు మందుగుండు సామగ్రి కలిగి వుండి ఐలాపూర్ నుండి కోరుట్ల వైపు కి వస్తున్నాడని సమాచారం రాగ కోరుట్ల సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ సతీష్ మరియు సిబ్బంది సత్తయ్య, సంతోష్,కేశవ్, సాగర్, శ్రీను లతో ఐలాపూర్ గ్రామా శివారులో వెహికిల్ చెకింగ్ చేస్తుండగా బైక్ పై వచ్చిన నిందితుడు పోలీసు లను చూసి అక్కడి నుండి తప్పించుకొని పారిపోతుండగా నిందితుడు సందరగిరి లక్ష్మి నర్సయ్యను పోలీస్ వారు పట్టుకొని చూడగా నిందితుడి మోటార్ సైకిల్ ట్యాంక్ కవర్లో నుండి 1 పిస్టల్ (ఆటో పిస్టల్ మేడ్ ఇన్ యూఎస్ఏ), 2 మాగ్జిన్ లు, 3 బుల్లెట్లను (కే.ఎఫ్ 7.65 లైవ్ రౌండ్స్), ఒక సెల్ ఫోన్ ను ఇద్దరు పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగింది. కేసు వివరాల్లోకి వెళ్తే







ఐలాపూర్ గ్రామానికి చెందిన సందరగిరి లక్ష్మి నర్సయ్య తండ్రి లచ్చయ్య అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా పండ్ల వ్యాపారం చేస్తూ దాదాపు 50 లక్షల రూపాయలు నష్టపోవడం జరిగింది. ఈ క్రమంలో అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గత 7 నెలల క్రితం ముంబై లోని అసాంఘిక వ్యక్తులతో పరిచయం ఉన్న రాజు బాయి ఉరఫ్ గంగారాం ద్వారా ముంబై కి చెందిన నారాయణ, రమేష్, పాటిల్ మరియు బిట్టు ఉరఫ్ బంటిల సహాయంతో ముంబైలో ఒక పిస్టల్ ను ఒక లక్ష రూపాయలకు కొని ఐలాపూర్‌కు తీసుకుని వచ్చినాడు. ఈ క్రమంలో నిందితుడు ఐలాపూర్ మరియు చుట్టు ప్రక్కల గ్రామాలలో వివిధ వ్యక్తులను బెదిరించి మరియు అక్రమమార్గంలో సులువుగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశ్యంతో నిన్న అనగా తేది: 31-05-2023 సాయంత్రం 6:30 గంటలకు నిందితుడు ఐలాపూర్ నుండి కోరుట్లకి వస్తుండగ ఐలాపూర్ రైల్వే బ్రిడ్జి దగ్గర నమ్మదగ్గ సమాచారంతో వెహికల్ చెక్ చేస్తున్న కోరుట్ల ఎస్ఐ సతీష్ తన సిబ్బందితో నిందితుడిని పట్టుకొని అతని వద్ద నుండి 1 పిస్టల్, 2 మాగ్జిన్ లు, 3 బుల్లెట్లు, ఒక మోటార్ సైకిల్ మరియు సెల్ ఫోన్‌లను పంచుల సమక్షంలో స్వాధీన పరచుకొని కేసు నమోదు చేయడం జరిగింది. అనంతరం కోరుట్ల సిఐ ప్రవీణ్ కుమార్ నిందితుడు సందరగిరి లక్ష్మి నర్సయ్య ను అరెస్ట్ చేయనైనది. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన డిఎస్పి రవీందర్ రెడ్డి, కోరుట్ల సిఐ ప్రవీణ్ కుమార్, కోరుట్ల ఎస్ఐ సతీష్ మరియు సిబ్బంది సత్తయ్య, సంతోష్, కేశవ్, సాగర్, శ్రీనులను జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అభినందించినారు. చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ సామాన్య ప్రజానీకానికి వారి భద్రతకు భంగం కలిగించే వారిపై పటిష్టంగా నిఘా పెట్టడం జరిగిందని అలాంటి వారిని ఉపేక్షించేది లేదని చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

# పాండిత్యానికి ప్రతి రూపం విద్వన్మణి రాజన్న శాస్త్రి

## 'జూన్ 2' రాజన్న శాస్త్రి జయంతి

రామ కిష్టయ్య సంగన భట్ల

**ధర్మపురి, జూన్ 01 (ప్రజామంటలు):** నిరంతర పఠన మందే మనసును లగ్నం చేసి, సిద్ధి పొందిన సాహితీ తాపసి కొరిడె రాజన్న శాస్త్రి. కావ్య వ్యాఖ్యల్లో మల్లినాథసూరి వలె, శాస్త్ర వ్యాఖ్యలలో అభినవ గుప్తుని వలె, శ్లేష రచనలో శ్రీహర్షుని వలె, కమనీయ కవితలో కాళిదాసు వలె వచన రచనలో దండి వలె, ప్రసంగాలలో కవిసామ్రాట్ వలె భాసించిన బహుముఖ ప్రజ్ఞాశాలి రాజన్న శాస్త్రి. వేద వేదాంగ శాస్త్ర ఆగమ సకల కళలకు కాణాచి అయిన ధర్మపురి క్షేత్రంలో 1933 జూన్ 2న జన్మించిన శాస్త్రి, ఇంటి వద్ద వేద సంస్కృత అధ్యయనాలు చేసి, మహారాష్ట్ర, గుజరాత్, ఇతర ప్రాంతాలలో లబ్ధ ప్రతిష్టులైన తాడూరి బాలకృష్ణ శాస్త్రి వద్ద కావ్య పాఠాలు, పాలెపు వేంకటరాయ శాస్త్రి చెంత, అద్వైత పూర్వ మీమాంసాదులను అభ్యసించారు. సంస్కృతాంధ్రాలలో ప్రైవేటుగా పరీక్షలు రాసి ఉపాధ్యాయ, అధ్యాపక స్థాయి నుండి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్య స్థాయికి, స్వయం కృషితో చేరుకున్నారు. మనోహర కవితాధారలను స్రవించడమే కాకుండా, అమర భాషలు శ్లేషలో రెండర్థాలతో "బలి పుష్ట విలసితం"అనే పేరుతో కాకి, రాజకీయ నేతక్షుద్రవ్యంలో సమానులే అనే భావం ప్రకటితమ య్యేలా, ఆయన ద్వర్థి లఘు రచన సమస్త భారతావనిలో అభిమాన పాత్రతకు కారణమైంది. అలాగే , "గణనాయక స్తవం" పేరుతో రచన... పైకి గణపతి ప్రార్ధన, తరచి చూడ, లోన నాయకుల ప్రస్తావన ఇమిడించుకుంది. "మధుపవి గీతి" లో తేనెను త్రాగుతున్న తుమ్మెదను వర్ణిస్తూ త్రాగుబోతు దుశ్చర్యలను శ్లేషార్థంతో విరచించారు. హరిహర స్తుతి మరో శ్లేష కావ్యం. చలన చిత్రాలు కళ, విజ్ఞానం అందించాల్సిన సాధనాలుగా ఉండాలని, కానీ అది హింస, అశ్లీలతతో కూడి ఉంటున్నాయని ఆవేదన భరిత సామాజిక బాధ్యతలు వ్యక్తీకరించారు. అలంకార శాస్త్ర గ్రంథం పరిష్కారమే కాకుండా, అల్లసాని పెద్దనామాత్యుని "మను చరిత్ర" లోని ధ్వని సిద్ధాంత అనువర్తనాన్ని పరిశోధన



గ్రంథ రూపంలో వెలువరించి, ప్రతిభను చాటి చెప్పి, డాక్టరేట్ పొందారు. చిన్నయసూరి బాల వ్యాకరణానికి వ్యాఖ్యానం రాశారు. మరో రచన తారావళి గ్రంథం పండితామోదం పొంది, దివంగత ప్రధాని పీ.వీ.నర సింహా రావు ద్వారా సన్మానితుల చేసింది. దివాకర్ల సాహితి ట్రస్టు నుండి పురస్కార గ్రహీతలు అయినారు. స్వర్ణ భారతి పురస్కారం లభించింది. హైదరాబాద్ సంస్కృత భాషా ప్రచార సమితికి "వైస్ ఛాన్సలర్" గా పనిచేసి సంస్కృత భాషామ తల్లికి నీరాజనాలు అందించే కృషి జరిపారు. దివాకర్ల పండిత మండలిలో "భువన విజయం" భారతా వరణం, శ్రీనాథ కనకాభిషేకాది రూపకాలలో విభిన్న పాత్రలు ధరించి జీవం పోశారు. తాము పుట్టువు నొంది, పెరిగిన ధర్మపురి క్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహుని సుప్రభాత శ్లోకాలు, నిత్య ఉషోదయ ప్రతిధ్వనులుగా, కొనసాగుతూ వస్తున్నాయి. భర్తృహరి శతక త్రయంకు సంబంధించి చతుర్థ శతకం పేరున, 1987 లో "ఓరియంటల్ కాన్ఫరెన్స్" లో నూతన ఆవిష్కరణలు గావించి, విశేషాలను వివరించారు. "వసుమతీ వసుధాకరం" పేరుతో రాసిన సంస్కృత నాటకం, నాలుగు దశాబ్దాల నాటి సంస్కరణలపై వెలుగొంది ఆకాశవాణి కేంద్రం ద్వారా ప్రసారమై, సంస్కృత భారతిలో ప్రచురితమైంది. "వింశతి శతాబ్దీయ సంస్కృత కావ్యామృతం" లో భారత.దేశ వాసులకు సుపరిచితులైన, 20 మంది మహాకవుల సరసన స్థానాన్ని పొందారు. షోడశ్రీ అనే 16 మంది భారతీయ సంస్కృత కవుల పరిచయంలో, రాజన్న శాస్త్రి కవిత్వం ముద్రితంగా నిలిచింది. "నిబంధ రత్న సముచ్చయము", సరస్వత సుషమం, సూర్యోదయం, సాగరికా, సంవిద్, అమృత లతా, సంస్కృత శోధనా, సంస్కృత భారతి, మధురవాణి లాంటి అనేక పత్రికలలో వచ్చిన తమ రచనలను సంకలనం గావించారు. 3,500 శ్లోకాలతో కూడిన "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం" క్రీస్తుశకం 930 నాటి, ప్రాచీన తాళపత్ర గ్రంథాల్ని, స్థానికులు పండితులు కశోజ్ఝల సదాశివ శాస్త్రికి సహకరించి, పరిష్కరించి, దేవస్థానానికి ప్రచురణార్థం అందజేశారు. లక్ష్మీ నరసింహ సుప్రభాతం, ప్రపత్తి, కాళేశ్వర స్తుతి, హరిహర స్తుతి లాంటి దేవత స్తుతులతో తమ కవిత మాధుర్యాన్ని రంగరించారు. తమ పాండిత్య ప్రతిభతో యావత్ దేశానికి బహుముఖీన సాహిత్య సేవలందించి, తెలంగాణ పూర్వ పండిత సంప్రదాయ వారసునిగా, ప్రతినిధిగా నిలిచిన కొరిడె రాజన్న శాస్త్రి, 2013 మార్చి 11న పాంచభౌతిక శరీరాన్ని త్యజించి, పర బ్రహ్మలీనులైనారు.

# కేసిఆర్ అంటే కాలువలు, చెరువులు, రిజర్వాయర్‌లు...

## అపర భగీరథుడు కేసిఆర్...

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో రాయికల్ అభివృద్ధి

## ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

**రాయికల్ జూన్ 01 (ప్రజామంటలు):** పట్టణంలో 34 లక్షల్తో పెద్ద చెరువు మత్తడి నిర్మాణానికి భూమి పూజ (చెర్ల కొండాపూర్), 20 లక్షల్తో రాయికల్ వీరాపూర్ రోడ్డు సిసి రోడ్డు భూమిపూజ, 20 లక్షలతో రాయికల్ నుండి జగిత్యాల రోడ్డు సిసి రోడ్డు కు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి కల నీళ్లు, నిధులు, నియామకాలు అని అందులో భాగంగానే సాగు నీరు రైతులకు అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు చేపట్టారని ఉత్తర తెలంగాణలో కొంత నీటి కరువు ఉండేదని నేడు భూగర్భ జలాలు పెరగడం వల్ల రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని భూగర్భ జలాలు పెరిగిన విషయాన్ని సెంట్రల్ వాటర్ మిషన్ మరియు వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్ర సింగ్ ఈ విషయంపై తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించారని అన్నారు. కేసిఆర్ అంటేనే కాలువలు, చెరువులు, రిజర్వాయర్ లు అని అన్నారు. ముఖ్యమంత్రి గారు ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టే విధంగా రైతుల భూమి నష్ట పోకుండా తక్కువ దూరంలో చెక్ డ్యాం లను నిర్మించి భూగర్భ జల మట్టం పెరగడానికి, నీటి వసతి ఏర్పడ దానికి కృషి చేయటం జరిగిందని, నిండు వేసవిలో మత్తడి పారుతున్నాయాని అన్నారు, మెయిన్ కెనాల్ కు తొంబరావు పెట్ వద్ద D52 వద్ద గౌరవ ముఖ్యమంత్రి చొరవతో నేను కోరగానే తూముని ఏర్పాటు చేయడం









వల్ల తొంబారావు పేట, పోరుమల్ల, రాయికల్, చెర్ల కొండాపూర్, మైతాపూర్, ఇటిక్యాల, మూటపల్లి, కొత్తపేట బోర్న్ పల్లి ఇలా 14 గ్రామాలకు నీటి వసతి ఏర్పడిందని 25 కోట్ల వరకు నిధులు మంజూరు చేయడం జరిగిందని 35 కిలోమీటర్ల మేర నీరు నిల్వ ఉండడం తో ఒక జీవ నది లా కనిపిస్తుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అతి తక్కువ కాలంలో పూర్తి చేసి రివర్స్ పంపింగ్ విధానం ద్వారా వరద కాలువను జీవనదిలా మార్చిన ఘనత ముఖ్యమంత్రి దని, అపర భగీరథుడు కేసిఆర్ అని అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రైతు పక్షపాతి కాబట్టే తెలంగాణ రాష్ట్రంలో రైతులకు దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టారని రైతుబంధు 24 గంటల కరెంటు ఎరువులను అందుబాటులో ఉంచడం నకిలీ విత్తనాలు తయారు చేసే వారిపై పిడియాక్ట్ పెట్టడం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు సకాలంలో రైతు ఖాతాలో నగదు జమ చేయడం, రైతు వేదికలు, వ్యవసాయ అధికారుల నియామకం ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టి రైతులను రాజును చేసే దిశగా ముఖ్యమంత్రి గారు కృషి చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తూ రైతులను రాజకీయంగా వాడుకుంటున్నారని రైతులు గమనించాలని ఈ సందర్భంగా కోరారు.ప్రతి గింజా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రం లో గోదాంల నిర్మాణం చేపట్టి నిల్వ చేయటం జరిగింది అని, పాక్స్ అధ్వర్యంలో గోదాం లు నిర్మాణం చేపట్టామని అన్నారు. గతంలో 4 లక్షల మెట్రిక్ టన్నుల గోదాంలు ఉంటే నేడు 29 లక్షల మెట్రిక్ టన్నుల గోదాంలు ఉన్నాయని అన్నారు. ఎఫ్‌సిఐ ఎన్ని నిర్మించింది చెప్పాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రాయికల్ గ్రామాన్ని మున్సిపల్ గా మార్చడం జరిగింది అని, అందులో భాగంగానే రాయికల్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.రాయికల్ పట్టణంలో రోడ్లు,మినీ టాంక్ బండ్,సీసీ కెమెరాలు, కుల సంఘాల భవనాలకు నిధులు, సెంట్రల్ లైటింగ్, తదితర కార్యక్రమాలు చేపట్టి నిధులు కేటాయించామని, రాయికల్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పట్టణాలు మురికి కూపంలా ఉండేవని, నేడు పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా పట్టణాల రూపు రేఖలు మారాయి అని అన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రజల సహకారం కూడా తప్పనిసరీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ మోర హనుమాండ్లు, జెడ్పీటీసీ అశ్విని,వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి అచ్యుత రావు, కమిషనర్ సంతోష్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు కొల శ్రీనివాస్, ఇంతియాజ్, పాక్స్ ఛైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి, సర్పంచ్ రాజ్య లక్ష్మి లక్ష్మి నారాయణ, ఉప సర్పంచ్ సాయి రెడ్డి, గ్రామ శాఖ రవి, యూత్ అధ్యక్షులు వెంకటేష్, కౌన్సిలర్ లు సాయి, మేకల కాంతారావు, లతిక అనిల్, మహేందర్, శ్రీధర్ రెడ్డి, నాయకులు హరీష్, మహేంద్ర బాబు, దశరథమ్, నారాయణ గౌడ్, చంద్ర తేజ, బాబా, డిఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత వేసవి శిక్షణ తరగతులు ముగింపు

## పాల్గొన్న వేలేరు మండల సర్పంచ్ మాధవరెడ్డి, ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్

## మాట ఇచ్చిన ప్రకారం పిల్లల రిజిఉస్ట్రేషన్ ఫీజులు చెల్లించిన ఉపసర్పంచ్

**వేలేరు జూన్ 01 (ప్రజామంటలు):** వేలేరు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంబేద్కర్ ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షులు బొల్లం రాజు ఆధ్వర్యంలో ఒక నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరం నేటితో ముగిసింది. అనంతరం సర్పంచ్ మాధవరెడ్డి,ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్ మాట్లాడుతూ.... మండల కేంద్రంలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి దాదాపు 50 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ యొక్క వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకోవడం చాలా సంతోషకరం అన్నారు. వేడి నీళ్లకు చల్లని నీరు తోడు అన్నట్టు విద్యార్థులను వారి ప్రతిభను వెలికి తీసే విధంగా పాటుపడుతున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు దాదాపుగా 2011వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులు ప్రతి సంవత్సరం ఒక నెల రోజుల పాటు ఈ శిక్షణ తరగతులను కొనసాగించడం చాలా సంతోషకరం అని అన్నారు. ఈ సంవత్సరం ఈ శిక్షణ తరగతుల ఖర్చులు ఉపసర్పంచ్





సద్దాంహుస్సేన్ పిల్లల మీద ఎటువంటి భారం లేకుండా సద్దాం హుస్సేన్ భరించడం చాలా సంతోషకరం అని పలువురు కొనియాడారు. అనంతరం బిల్లా మహేందర్ విద్య ఫౌండేషన్ ద్వార పిల్లలకు మొదటి, ద్వితీయ, తృతీయ, బహుమతులు అందచేయమని వారు అంద చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు మొగిళిచెర్ల శ్రీనివాస్, రుద్రోజు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసి అధికారులతో మంత్రి పువ్వాడ సమీక్ష





**హైదరాబాద్ జూన్ 01 (ప్రజామంటలు):** డా.బి. ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తన ఛాంబర్ నందు ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సమీక్షించారు. నూతన బస్సుల రవాణా వెసులుబాటు, రావాల్సిన నూతన బస్సులు, డబుల్ డెక్కర్ బస్సులు, ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ, సంస్థకు వచ్చిన లాభాలు, వ్యయం, సంస్థలో చేపట్టిన పలు కార్యాచరణలు, బస్సుల ఓ.ఆర్. ఉద్యోగుల సంక్షేమం, అందిస్తున్న వైద్య సేవలు తదితర అంశాలపై సంస్థ ఎండి సజ్జనార్ అధ్వర్యంలో మంత్రి సమీక్షించారు. రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదేళ్లు పూర్తైన తరుణంలో సాధించిన విజయాలు, రాష్ట్ర రవాణ శాఖ సేవలు, వనరులు, ఆదాయ వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, భవిష్యత్తు ప్రగతి అంశాలను కార్యాచరణ ప్రణాళికను మంత్రి పువ్వాడ అజయ్ చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి కే. శ్రీనివాసరాజు, రవాణా శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్ జ్యోతి, సంయుక్త రవాణా కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తాంజనేయ విగ్రహ పునః ప్రతిష్టలో పాల్గొన్న శ్రీధర్ బాబు

**మహాదేవపూర్ జూన్ 01 (ప్రజామంటలు):** కాటారం మండలం గారెపల్లి శ్రీ భక్తాంజనేయ



విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమంలో మాజీమంత్రి ఏఐసీసీ సెక్రెటరీ మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ప్రజలందరూ సుఖ సంతో షాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వర్షాలు సకాలంలో పడి రైతులకి పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

**ఇబ్రహీంపట్నం జూన్ 01 (ప్రజామంటలు):** జూన్ రెండవ తేదీ నుండి 22వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జరుగుతాయని మొదటి రోజు ప్రభుత్వ కార్యాలయంలో పథకావిష్కరణ మరియు ఉత్సవాల ప్రారంభం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్ర శేఖర రావు ఆదేశాల మేరకు మరియు కోరుట్ల శాసనసభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సహకారంతో కార్యక్రమాలు నిర్వహించబడునని ఇట్టి కార్యక్రమాలలో అధికారులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇబ్రహీంపట్నం మండలం ఎంపీపీ జాజాల భీమేశ్వరి పత్రికా విలేకరుల సమావేశంలో తెలిపారు. 3వ తేదీన జరిగే రైతు దినోత్సవం సందర్భంగా ఇబ్రాహీంపట్నం మండల కేంద్రంలో రైతు వేదిక లో జరిగే సమావేశంలో రైతులతో కలిసి సహ పంక్తి భోజనానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు హాజరవుతారని తెలిపారు.






జగిత్యాల జిల్లా కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిల్లా కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన చిత్రం



తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించికొని సూపరింటెండెంట్ ఇంజనీర్, టిఎస్ఎన్ పిడిసిఎల్, జగిత్యాల విద్యుత్ ప్రగతి భవన్ కార్యాల యాన్ని జాతీయ పతాక రంగులతో కూడిన విద్యుత్ సిరీస్ బల్బులతో అందముగా అలంకరించాము. ఈ సందర్భంగా జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు, అధికారులకు, విద్యుత్ సిబ్బంది కి సూపరింటెం డెంట్ ఇంజనీర్, టిఎస్ఎన్ పిడిసిఎల్, జి. సత్యనారాయణ జగిత్యాల శుభాకాంక్షలు తెలియ చేశారు.

# బిజెపిలోకి భారీ చేరికలు

**కోరుట్ల టౌన్ జూన్ 01 (ప్రజామంటలు):** కేంద్రంలో నరేంద్రమోడీ అందిస్తున్న నీతివంతమైన పాలనకి అవినీతి రహిత పథకాలకు ఆకర్షితులై కేంద్రంలో మరియు రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా మల్లాపూర్ మండలం ఒడ్డెర కాలనికి చెందిన 100 మంది



మహిళలు యువకులు బిజెపి నాయకత్వానికి ఆకర్షితులై మల్లాపూర్ మండల బిజెపి అధ్యక్షులు ముద్దం సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ లో చేరారు.

కోరుట్ల నియోజకవర్గం బిజెపి నాయకులు సురభి నవీన్ కుమార్ పార్టీలోకి కండువాకప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సొరపక రమేశ్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షులు అంజమ్మ, కోరుట్ల పట్టణ కార్యదర్శి ఎర్ర రాజేందర్, మల్లాపూర్ బూత్ అధ్యక్షులు గోల్లేన వెంకటేష్, రాజు, గంగ నర్సయ్య, రాజ రెడ్డి, పాపయ్య, వల్లజి నగేష్, శ్రావణ్ మరియు బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల కోరిక మేరకు క్రీడా వస్తువులు అందజేత

**జనగామ జూన్ 01 (ప్రజామంటలు):** జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నేలపొగుల గ్రామ విద్యార్థుల కోరిక మేరకు పార్టీ కార్యాలయములో ఎంపీటీసి డాక్టర్ గుగ్గిల్ల నర్సయ్య కాంగ్రెస్ విద్యార్థులకు బ్యాట్లు, బంతులు అందించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ నర్సయ్య మాట్లాడుతూ.... విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు కూడ ముఖ్యమేనని



అన్నారు. ఇట్లాంటి కార్యక్రమాలు క్రీడ స్ఫూర్తిని పెంపొందిస్తాయని, ఉత్సాహవంతులకు ప్రోత్సాహం అందించాలనే దానితో క్రీడ వస్తువులు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు గైని ప్రవీణ్, తేరల శ్రీకాంత్, ఆకుల సాయి, కందగట్ల భాస్కర్, విద్యార్థులు దయాకర్, విజయ్, శివ ఫైజల్, ఆనంద్, ప్రేమ్ స్టిపన్ నకిర్త, జస్వంత్, నోముల హరీష్, సానిక వినయ్, నాకిర్త శ్రీనాథ్, సముద్రాల రోహిత్, చెరబుడ్డి దినేష్ రెడ్డి, గ్రామ పెద్దలు వడ్లకొండ ఎల్లయ్య, జనగాం అబ్బ సాయిలు, కమ్మరి సత్తయ్య, వడ్లకొండ సత్తయ్య, విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జనగామ నియోజకవర్గం ముఖచిత్రం మారనుందా?

**కొత్త అభ్యర్థి ఎమ్మెల్యే కావాలని ఎదురు చూస్తున్న ప్రజలు**

**పొన్నాల లక్ష్మయ్య పాలన చూశారు**

**ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాలన చూస్తున్నారు**

**ప్రజలు అవకాశం యిస్తే ఎమ్మెల్యే, ఎం.పి.గానో పోటీ చేస్తానంటున్న కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి**




**జనగామ జూన్ 01 (ప్రజామంటలు):** ఈ ఏడాదిలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో జనగామ నియోజకవర్గంలో నుండి కొత్త అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందితే అభివృద్ధి వేగవంతం అవుతుందనే చర్చ జిల్లా కేంద్రంలో జోరుగా సాగుతోంది. జనగామ నియోజకవర్గం బి.ఆర్.ఎస్. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి రెండుసార్లు ఈ ప్రాంత ప్రజలు గెలిపించారు. వీరి హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు.

గతంలో కాంగ్రెస్ పార్టీ నుండి పొన్నాల లక్ష్మయ్య జనగామ శాసనసభ నియోజకవర్గం నుంచి 4 సార్లు శాసనసభకు ఎన్నికకావడమే కాకుండా 4గురు ముఖ్యమంత్రుల హయాంలో రాష్ట్ర మంత్రి గానూ పనిచేశారు. 2014, మార్చి 11న తెలంగాణ పిసిసి తొలి అధ్యక్షులుగా నియమితులైనారు. వీరి పరిపాలన కాలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలు చూశారు. ప్రధానంగా జనగామ నియోజకవర్గం ఎర్పడిన నుండి నేటి వరకు అందరు స్దానికేతురులే కావడం గమనార్హం. ఈసారి మాత్రం ప్రజలు స్దానికులే ఎమ్మెల్యే కావాలనే బలమైన కోరికతో ఉన్నారు. మట్టికైనా ఇంటోడే ఉండాలనే నానుడిని ప్రజలు గుర్తు చేస్తున్నారు. అన్ని పార్టీలు ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో స్థానికతను దృష్టిలో ఉంచుకోవాలని విన్నవిస్తున్నారు. అందరికి అవకాశం ఇచ్చారు. ఒకసారి నాకు అవకాశం ఇవ్వడంటూ నాడు బార్డర్ లో సైనికుడిగా దేశ ప్రజల రక్షణ కోసం,ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వెలకట్టలేని విలువైన సేవలు అందిన కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి రంగం సిద్ధం చేసుకున్నారు. మేధావిగా, విద్యావంతునిగా, డాక్టర్ గా, ఐక్య రాజ్యసమితి లోను పనిచేసిన అనుభవం ఉంది. ఈ మధ్యకాలంలో తక్కువ సమయంలో కళా,సాహిత్య, యువజన, కుల సంఘాల పలు కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. పలు కార్యక్రమాల్లోను పాల్గొంటున్నారు. అభిమానం చూరగొంటున్నారు. ప్రజా వైద్యులుగా సేవలు అందిస్తూనే సమాజహితం కోసం అలుపెరుగని కృషి చేస్తున్నారు కల్నల్ బిక్షపతి. అవకాశం యిస్తే జనగామ నియోజకవర్గం ఎమ్మెల్యే గాని, భువనగిరి పార్లమెంటు కు ఎంపి గాని నిలబడి ప్రజాసేవ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్న సమాచారం. దేశాదేశాలు తిరిగిన అనుభవంతో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పాటు పడుతానని భావిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ స్దానికత, నూతన అభ్యర్థి పట్ల ఉన్న ప్రజల ఆలోచన విధానం ఎంత వరకు సఫలం అవుతుందో వేచి చూడాల్సిందే.

## రైతుల ఇబ్బందులు పట్టించుకోవడం లేని బిఆర్ఎస్
# సంబరాలు చేయడానికి సిద్ధమవుతోంది

**గొల్లపల్లి జూన్ 01 (ప్రజామంటలు):** రైతుల ఇబ్బందులు పట్టించుకోవడం లేదు కానీ బిఆర్ఎస్ సంబరాలు చేయడానికి సిద్ధమవుతోంది అంటున్న సామాజిక కార్యకర్త మోతే నరేష్.

ధర్మపురి నియోజకవర్గంలో రైతుల కోసం సైకిల్ యాత్ర.

గురువారం సైకిల్ యాత్రలో భాగంగా అంబారిపేటలోమే 27వ తేదీ రోజు నుండి మొదలుపెట్టి ఎండపల్లి, ధర్మారం,



పెగడపల్లి, ధర్మపురి మండలాలలో ముగించుకొని ఈరోజు అనగా తేదీ 1/ 6 /2023 రోజున చందోలి, చిల్వకోడూర్, గొల్లపెల్లి, వెనుగుమట్ల, గోపులాపూర్ యశ్వంత్ రావ్ పేట్, బుగ్గారం. గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త మోతే నరేష్ మాట్లాడుతూ.... రైతులు వ్యవసాయం చేస్తున్నారు కానీ రైతులు రైస్ మిల్లర్ల దోపిడి వల్ల చాలా నష్టపోతున్నారని, రాజకీయ నాయకులై జోకిన తర్వాత వారు ఏం పట్టించుకోవడంలేదని అంటున్నారు. మరియు ప్రభుత్వం ప్రతి గింజ కొంటాము అని చెప్పి ఇప్పుడు మాత్రం ఒక్క బస్తా కి రెండు కిలోల నుండి నాలుగు కిలోల వరకు కట్ చేస్తున్నారని అలాగే రైస్ మిల్లు నుండి లారీలు కూడా పంపించడం లేదని వాపోయారు.

ధర్మపురి నియోజకవర్గంలో ఉన్నటువంటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ఏం పట్టించుకోవడం లేదని తప్ప, తాలు పేరుతో ఎలాంటి కటింగ్ లేకుండా రైస్ మిల్లర్లు తీసుకునేలా కొప్పుల ఈశ్వర్ బాధ్యత తీసుకోవాలని ధర్మపురి నియోజకవర్గ రైతుల పక్షాన సామాజిక కార్యకర్త మోతే నరేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# బిజెపి మండల కార్యవర్గ సమావేశం

**తరిగొప్పుల జూన్ 01 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస యాదవ్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం శ్రీ కృష్ణ గీతా మందిరం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి శోభనబోయిన శివరాజ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తు కార్యక్రమాల గురించి వారు వివరించడం జరిగింది. పోలింగ్ బూత్ లో విజయం సాధించడమే ధ్యేయంగా పని చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పబ్బోజు రామ్ బ్రహ్మచారి, దళిత మోర్చారాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండ ప్రసాద్, జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షులు ఎర్రవెల్లి ప్రతాప్, మండల వైస్ ప్రెసిడెంట్ తలకొక్కుల శ్రీనివాస్, కొన్నె రాజు, కర్రే పోశయ్య, బీజేవైఎం మండలాధ్యక్షులు జంగ వీరకుమార్, పెద్ద బోయిన రాజు, మూడవత్ రాజు, కందారపు బాలయ్య, అల్పతి, మేకల కిష్టయ్య, సంపత్, రాజు, గొలుసుల రాజు, మేకల రమేష్, తదితరులు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వొడితల చేతుల మీదుగా దళిత రత్న అవార్డు అందుకున్న వంగర వాసులు

**భీమదేవరపల్లి జూన్ 01 (ప్రజామంటలు):** మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ స్వగృహంలో పివి మనవడు హైకోర్టు న్యాయమూర్తి, హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ చేతుల మీదుగా కండే రమేష్, సుధాకర్, సంజీవ్ దళిత రత్న, దళిత యువరత్న అవార్డులను అందుకున్నారు. వీరు గత కొన్ని సంవత్సరాలు ప్రజా ఉద్యమాలు, దళిత సంఘాలు, తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న సందర్భంగా అవార్డుకు ఎంపిక అయ్యారు.






అనంతరం వారు మాట్లాడుతూ ఈ అవార్డుకు ఎంపిక చేసిన మేడి పాపన్న, అంబేద్కర్ సంఘ రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. వీరు సామాజిక బాధ్యతతో అవార్డు సాధించడం పట్ల పీవీ కుటుంబ సభ్యులు పీవీ ప్రభాకర్ రావు, మదన్ మోహన్, కిరణ్, వంగర గ్రామ సర్పంచ్ ఆలూరి రజిత, ఉప సర్పంచ్ నల్లగోని రాజు, ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి, దళిత సంఘ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు వర్షం వ్యక్తం చేశారు.

## పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షునికి నాలుక క్యాన్సర్

**ఆదుకోవాలని వేడుకోలు**

**ఎల్కతుర్తి జూన్ 01 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని దండపల్లి గ్రామానికి చెందిన గడ్డం రఘు గత మూడు నెలలుగా ఎంజీఎం హాస్పిటల్ లో ట్రీట్మెంట్ చేసుకోగా నయం కాకపోవడంతో స్థానిక హాన్మ కొండలోని ప్రైవేట్ హాస్పటల్కు రిఫర్ చేసినట్లు ఆయన తెలిపారు. అసలే రెక్క ఆడితే డొక్కా నిండని పేద కుటుంబానికి చెందిన రఘు పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకత్వం వహిస్తూ అతి పేదరికంలో ఉండడం గమనార్హం. డాక్టర్ల నిర్లక్షం క్యాన్సర్ ను మొదటి స్టేజి లోనే గుర్తించక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతు జూనియర్ డాక్టర్లతో ట్రీట్ మెంట్ చెయ్యడం వలన రోగం తగ్గక తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. ఎవ్వరైనా దాతలు 9959587866, పోన్ పేలేదా గోగుల్ పే ద్వారా సహాయం చెయ్యాలని వేడుకుంటున్నారు.



# జూన్ 10న హైదరాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ సంఘాల సమావేశం


**సికింద్రాబాద్ జూన్ 01 (ప్రజామంటలు):** జూన్ 10న జరిగే హైదరాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సర్వసభ్య సమావేశానికి సికింద్రాబాద్ నియోజకవర్గం అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ సాధన దిశగా జులై లో జరగబోయే మాదిగల శక్తి



నుంచి వందలాదిగా తరలి వెళ్ళడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డప్పు మల్లికార్జున్ మాదిగ పేర్కొన్నారు. గురువారం బౌద్ధనగర్ డివిజన్ న్యూ అశోక్ నగర్లో జరిగిన సన్మాహాక సమావేశంలో మాట్లాడుతూ....ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అద్యక్షులు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ప్రతి ఒక్క ఎమ్మార్పీఎస్ , ప్రదర్శన ఏర్పాట్ల గురించి ఆ సమావేశంలో చర్చిస్తారని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ నాయకులు డప్పు మల్లికార్జున్, దాసరి సంగం, రావుల యాదగిరి, కొలిపాక మోహన్ రావు, తుడుము నాని, చంద్రగిరి సాయి, నవాడి రామ్, సుశీల్, కృష్ణ, శివకుమార్, నరేంద్రకుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.





# పూజా హెగ్డేకు కాలం కలసి రావట్లేదా?

కెరీర్ మొదట్లో రెండు ఫ్లాపులు పడినా ...తెలుగులో ఎలాగైనా సరే స్టార్ క్రేజ్ తెచ్చుకోవాలని ఫిక్స్ అయిన పూజా హెగ్డే అల్లు అర్జున్ తో చేసిన దువ్వాడ జగన్నాథం సినిమాలో గ్లామర్ ట్రీట్ చేసి ప్రేక్షకులను మెప్పించింది. ఇక ఆ సినిమా తర్వాత నుంచి అమ్మడు వెనక్కి తిరిగి చూసుకున్నది లేదు. వరుస స్టార్ ఛాన్స్ లతో కెరీర్ పీక్స్‌కి చేరింది. స్టార్ సినిమా అంటే చాలు పూజా హెగ్డే హీరోయిన్ అనే రేంజ్‌కి వెళ్లింది. దాదాపు టాలీవుడ్ స్టార్స్ అందరితో నటించిన పూజా హెగ్డే అదే ఫాం కొనసాగిస్తుందని అనుకోగా చూస్తుంటే అమ్మడి గ్రాఫ్ అలా అలా పడిపోతూ వస్తుంది. ఈమధ్య పూజా హెగ్డే నటించిన సినిమాలేవి అంతగా సక్సెస్ కాకపోవడంతో దర్శక నిర్మాతలు కూడా ఆమెను లైట్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం బుట్ట బొమ్మ చేతిలో మహేష్ గుంటూరు కారం మాత్రమే ఉంది. ఆ సినిమా హిట్ పడితే అమ్మడికి ఛాన్స్ లు వస్తాయేమో కానీ అసలు సూపర్ ఫాం లో ఉన్న బుట్ట బొమ్మ ఒకేసారి ఇలా ఖాళీ అవడం వెనక రీజన్ ఏంటా అని ఆరా తీస్తున్నారు. పూజా బేబ్ సినిమాలో ఉంటే గ్లామర్ షోకి కొదవే లేదు. అమ్మడు థై షో తోనే ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది. మరి అలాంటి పూజా ని ఎందుకు మేకర్స్ వద్దనుకుంటున్నారన్నది అర్థం కాని విషయం. మహేష్ సినిమా తప్ప మరో స్టార్ సినిమా కనీసం డిస్కషన్ లో కూడా లేదు. అందుకే అమ్మడు బాలీవుడ్ మీద స్పెషల్ ఫోకస్ చేస్తుంది. అయితే బీ టౌన్ లో అమ్మడికి లక్ కలిసి రాలేదు. అక్కడ స్టార్ సినిమాలు చేస్తున్నా సరే హిట్టు మాత్రం దక్కలేదు. అందుకే పూజా హెగ్డే తనకు స్టార్ క్రేజ్ తెచ్చిన టాలీవుడ్ లోనే ఇంకా సినిమాలు చేయాలని చూస్తుంది. మహానటి రేంజ్ లో యాక్టింగ్ స్కిల్స్ లేకపోయినా అమ్మడి గ్లామర్ షోతో స్టార్ మేనియా కొనసాగిస్తుంది.గుంటూరు కారం ఘాటైన హిట్ పడితే కానీ మళ్లీ తెలుగులో పూజా హెగ్డే తిరిగి ఫాంలోకి వచ్చే ఛాన్స్ కనిపించడం లేదు. అయితే ఆ సినిమాలో కూడా పూజాతో పాటుగా శ్రీ లీల కూడా స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. సినిమా హిట్ పడినా బేబీకి ఏమాత్రం కలిసి వస్తుందో చూడాలి.హిందీలో ఒకటి రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని తెలుస్తుండగా వాటి గురించి త్వరలో క్లారిటీ రానుంది. తమిళ పరిశ్రమ నుంచి కూడా పూజా హెగ్డేకి పెద్దగా ఛాన్స్ లు రావట్లేదు.

# ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు

## 9న వరుణ్,లావణ్యల ఎంగేజ్‌మెంట్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ పెళ్లికి సంబంధించి గత కొంతకాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. వరుణ్ తేజ్ హీరోయిన్ లావణ్య త్రిపాఠితో గత కొంతకాలంగా ప్రేమలో ఉన్నారంటూ ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఆ మధ్య అయితే ఏకంగా వారిద్దరికీ నిశ్చితార్థం కూడా జరిగిపోయిందంటూ పుకార్లు వచ్చాయి. అయితే ఈ సారి నిజంగానే వీరి నిశ్చితార్థం జరగనుందట. ఈ పెళ్లి కోసమే లావణ్య తనకు వస్తున్న ఆఫర్లను కూడా రిజెక్ట్ చేస్తూ వస్తోందట.ఈ క్రమంలో వీరి పెళ్లికి మెగా ఫ్యామిలీ గ్రీన్ సిగ్నల్ చేసినట్లు తెలుస్తోంది. సన్నిహిత వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల అంటే జూన్ 9వ తేదీన వీరి నిశ్చితార్థం జరగనుందట. ఈ నిశ్చితార్థంలో మెగా హీరోలు అందరూ ఉండాలని అనుకుంటున్నారట.
అందుకే మెగాస్టార్ చిరంజీవి రామ్ చరణ్ డేట్స్ కి ఇబ్బంది కలగకుండా వారందరికీ కన్వినెంట్ గా ఉండేలా ఈ రోజును సెలక్ట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిశ్చితార్థానికి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కూడా వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆరోజే పెళ్లి తేదీని ప్రకటించే అవకాం ఉంది.





కాగా గతేడాది లావణ్య పుట్టిన రోజు సందర్భంగా బెంగళూరులో స్నేహితులతో పార్టీ చేసుకోగా ఆ పార్టీలో వరుణ్ కూడా పాల్గొన్నాడట. ఆ సమయంలో వరుణ్ ఆమెకు డైమండ్ రింగ్ ఇచ్చి మరీ మ్యారేజ్ ప్రపోజల్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికి వీరి పెళ్లి గ్రీన్ సిగ్నల్ రావడం గమనార్హం.అయితే వీరిద్దరికి మిస్టర్ మూవీ సమయంలో పరిచయం ఏర్పడింది. 2017లో తెరకెక్కిన ఈ సినిమాకి శ్రీనువైట్ల దర్శకత్వం వహించారు. ఈ మూవీ సమయంలోనే వీరి మధ్య ప్రేమ చిగురించిందని తెలుస్తోంది. ఆ మూవీ హిట్ కాకపోయినా వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ వర్కౌట్ అవ్వడం విశేషం. ఆ తర్వాత అంతరిక్షంలోనూ వీరిద్దరూ జంటగా కనిపించారు. లావణ్య ఉత్తరప్రదేశ్ కి చెందిన యువతి కాగా అందాల రాక్షసి సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ప్రస్తుతం వరుణ్ తేజ్ రెండు సినిమాలు చేస్తున్నారు. అందులో ఒకటి... ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో 'గాంఢీవదారి అర్జున'. మరొకటి... ఏవియేషన్ థ్రిల్లర్. దానిని సోనీ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం బుడాపెస్ట్ సిటీలో ప్రవీణ్ సత్తారు యాక్షన్ థ్రిల్లర్ సినిమా షూటింగ్ చేస్తున్నారు.

# మరో బాలీవుడ్ స్టార్

## గ్లోబల్ స్టార్ అవ్వబోతున్నాడా?

బాలీవుడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా హాలీవుడ్ లో వచ్చిన ఆఫర్లను సద్వినియోగం చేసుకుని సక్సెస్ అయ్యింది. చిన్న పాత్రలు.. పెద్ద సినిమాలు అనే ఆలోచన లేకుండా వచ్చిన ప్రతి ఒక్క అవకాశం ను కూడా ప్రియాంక చోప్రా సద్వినియోగం చేసుకుంది. సినిమాలు మరియు సిరీస్ లతో గ్లోబల్ స్టార్ అంటూ ప్రియాంక చోప్రా ప్రస్తుతం పిలిపించుకుంటుంది. హాలీవుడ్‌లో మన ఇండియన్ స్టార్స్‌ను పట్టించుకోరు... మన ఇండియన్ సినిమా స్టార్స్ ఇండియా బయట పనికి రారు అంటూ విమర్శలు ఉన్న నేపథ్యంలో ప్రియాంక చోప్రా హాలీవుడ్ సందడి అందరికి కూడా చెంపపెట్టు అన్నట్లుగా సమాధానం ఇవ్వడం జరిగింది. ఇప్పుడు మరోసారి ఇండియన్ స్టార్ హాలీవుడ్ దృష్టిని ఆకర్షించడం జరిగింది. బాలీవుడ్




యంగ్ స్టార్ రణవీర్ సింగ్ ఒక వైపు హిందీ లో వరుసగా సినిమాలు చేస్తూ ఉన్నాడు. ఈ సమయంలోనే హాలీవుడ్ సినిమాలో నటించేందుకు గాను ఓకే చెప్పాడు అంటూ వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ మీడియా కథనాల ద్వారా తెలుస్తున్న విషయం ప్రకారం ప్రముఖ హాలీవుడ్ ప్రొడక్షన్ ఏజెన్సీ అయిన విలియం మోరీస్ ఎండివోర్‌తో రణవీర్ సింగ్ ఒప్పందం చేసుకున్నాడట. పారితోషికంతో పాటు డేట్ల విషయంలో కూడా ఒప్పందం జరిగిందని... త్వరలోనే ప్రాజెక్ట్ కు సంబంధించిన వివరాలను కూడా బయటకు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి అంటూ వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం హిందీ లో వరుస సినిమా లతో రణవీర్ సింగ్ దూసుకు పోతున్న విషయం తెల్సిందే. ప్రస్తుతం కరణ్ జోహార్ దర్శకత్వంలో రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ సినిమాలో నటిస్తున్నాడు. జూలై 28న ఆ సినిమా విడుదల అవ్వబోతుంది. మరో రెండు హిందీ సినిమాలు కూడా లైన్‌లో ఉన్నాయి.

# కోలీవుడ్‌లో విలన్‌గా సునీల్!

సునీల్ కెరీర్ మళ్లీ పట్టాలెక్కిన సంగతి తెలిసిందే. వచ్చిన అవకాశాలు అందుకుంటూ గాడి తప్పిన బండిని మళ్లీ పట్టాలెక్కించి వేగం పెంచే పనిలో ఉన్నాడు. స్టార్ హీరోల చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా కొనసాగుతూనే చిన్న సినిమాల్లో నూ నటిస్తున్నాడు. పాత్ర ఏదైనా? నో అనకుండా చేస్తున్నాడు. 'పుష్ప' సినిమా తో తన లో కొత్త యాంగిల్‌ని పరిచయం చేసిన సంగతి తెలిసిందే. ప్రతి నాయకుడి పాత్ర లో ఆద్యంతం ఆకట్టుకు న్నాడు. విలన్ గానూ మెప్పించగలడని నిరూపించుకున్నాడు. ఆ సినిమా తో పాన్ ఇండియాలో గుర్తింపు దక్కింది. ఇప్పుడా క్రేజ్ తో నే కోలీవుడ్ లో సైతం విలన్ గా నటించడానికి రెడీ అయినట్లు తెలుస్తోంది.

తెలుగు నటి అంజలి ప్రధాన పాత్రలో 'ఈగై' అనే సినిమా తెరకెక్కుతోంది. ఇదొక ఇన్వస్టిగేటివ్ థ్రిల్లర్ జానర్ సినిమా. తెలుగు..తమిళ్ లో ఈ చిత్రాన్ని అశోక్ వేలాయుధన్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో ప్రతినాయకుడి పాత్రకు తెలుగు నటుడు సునీల్ ని ఎంపిక చేసారు. తాను రాసుకున్న పాత్రకు సునీల్ అయితేనే న్యాయం చేస్తాడని భావించి ఆయన్ని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. తెలుగు మార్కెట్ పరంగానూ సునీల్ అయితే వర్కౌట్ అవుతుందన్న కోణం లోనూ అతని ఎంపిక కనిపిస్తుంది.



సీతమ్మ కి తోడుగా సునీల్ లాంటి బలమైన పాత్ర దొరికితే! ఇక్కడ మార్కెట్ పరంగా ఇబ్బంది ఉండదు. అదీ ఓ కారణం కావచ్చు. ఇక తమిళ్ లో అంజలి కి ఎలాగూమంచి గుర్తింపు ఉంది. కొన్నేళ్లగా అక్కడే సినిమాలు చేస్తుంది. తెలుగు నటి అయినా తమిళ్ లో స్థిరపడిన నటి. జూన్ 9 నుంచి సినిమా షూటింగ్ ప్రారంభం కానుందిట. ముంబై ..చెన్నై..హైదరాబాద్ ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహించనున్నట్లు సమాచారం. ఇది సునీల్ కి మంచి అవకాశం. పుష్ప తర్వాత సునీల్ కి పెద్ద సినిమా పడలేదు. పెద్ద సినిమాల్లో నటించినా చిన్న పాత్రలు మాత్రమే. ఈ నేపథ్యంలో అంజలి సినిమా లో విలన్ రోల్ అంటే! మళ్లీ ఫేమస్ అవ్వడానికి అవకాశం ఉంది. పైగా కోలీవుడ్ దర్శకుడి సినిమా కాబట్టి పాత్రలో విషయం ఉంటుందని చెప్పొచ్చు. సక్సెస్ అయితే సునీల్ కటౌట్ కి తమిళ్ లో మంచి అవకాశాలు వస్తాయి. ఈ తరహా కటౌట్ లు అక్కడ ఫెయిలైంది లేదు. మంచి సక్సెస్ రేటుంది. తమిళ తంబీలు సునీల్ తరహా టైమింగ్ కి బాగా కనెక్ట్ అవ్వడానికి అవకాశం ఉంది.

# మరో యాక్షన్ సినిమాలో నాని

దసరా లాంటి బ్లాక్ బాస్టర్ హిట్టు తర్వాత న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం నాని 30 డెబ్యూ డైరెక్టర్ శౌర్యువ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ అందించాడు నాని. గోవా షెడ్యూల్ తర్వాత తాజాగా ముంబై షెడ్యూల్‌ను కూడా పూర్తి చేసింది నాని అండ్ టీం. మరింత లవ్, ప్యాషన్‌తో ఎక్జయిటింగ్ ముంబై షెడ్యూల్ పూర్తయింది. మీతో త్వరలో ఓ మ్యాజిక్‌ను షేర్ చేసుకునేందుకు వెయిట్ చేయలేకపోతున్నాం.. అంటూ వైరా ఎంటర్ టైన్‌మెంట్స్ ట్వీట్ చేసింది. కూనూర్ షెడ్యూల్ కోసం రెడీ అవుతున్నట్టు కూడా పోస్టర్ ద్వారా తెలియజేశారు. ముంబై తీర ప్రాంతంలో నాని నడుచుకుంటూ వెళ్తున్న విజువల్స్ తో పోస్ట్ చేసిన వీడియో ఇప్పుడు నెట్టింట్లో ట్రెండింగ్ అవుతోంది. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా సినిమా ఉండబోతున్నట్టు ఇప్పటికే విడుదలైన గ్లింప్స్



వీడియో ద్వారా క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్.

ఈ చిత్రంలో నాని కూతురిగా బేబి కైరా ఖన్నా నటిస్తోంది. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ మూవీలో సీతారామం ఫేం మృణాళ్ ఠాకూర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజేందర్ రెడ్డి తీగల, మూర్తి కేఎస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# చూసే దృష్టి కోణం

(కవిత)

రోజురోజుకు పెరుగుతున్న
శాస్త్ర సాంకేతిక నైపుణ్యత
వాయువేగాన్ని మించి వ్యాపిస్తూ
సోషల్ మీడియా నేపథ్యంలో
పలుమార్గాలలో పయనిస్తూ
ఎక్కడ ఏమూల ఏం జరిగినా
ఆఘమేఘాలుగా వార్తలందిస్తూ
క్షణాలలో స్పందనలు,
ప్రతిస్పందనలు
కొన్నిసార్లు ఉన్నవి లేనట్టు,లేనివి ఉన్నట్టు
ప్రచారంలో పరుగులుతీస్తున్నవి
తెలియని వ్యక్తుల పరిచయాల పరంపరలో
జరిగే మంచి కొంత ఉన్నప్పటికి
జరుగుతున్న అనర్థాలు ఎన్నో ఎన్నెన్నో
స్మార్ట్ ఫోనే ప్రపంచమై,
వంచిన తల ఎత్తక
వాట్స్ ప్, ఫేస్ బుక్,
ఇన్స్టాగ్రామ్, ట్విట్టర్ లలో
గంటలు గంటలు కాలక్షేపం చేస్తూ
ఏది మంచో,ఏది చెడో గుర్తించలేని జనాలు
వెర్రితలలు వేసే అనాగరిక చర్యలు
చూసే దృష్టి కోణాన్ని బట్టి ఫలితాలిచ్చే మీడియా
విచక్షణతో ఉపయోగించండి
సోషల్ మీడియా వాడుకలో సమస్త దారులు
ఎన్ని ఉన్నా గుర్తెరిగి భద్రంగా
అవగతం చేసుకుంటే
విషపు కోరల దాటి విజ్ఞానం చేరుకున్న నాడు
వినోదాలలో విలువలు గుర్తించి నడుచుకున్ననాడు
అవుతుంది
సోషల్ మీడియా బెస్ట్ మీడియా



రచన: లగిశెట్టి ప్రభాకర్
జనగామ, 9441700316







PRINTED AND PUBLISHED BY V NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO , RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com